ఇజ్రాయిల్ మారణ హోమం

నిలిపివేయాలి

- మోడీ వైఖరి దేశ ప్రతిష్టకు భంగకరం
- పాలస్తీనా సంఘీభావ కార్యక్రమంలో ప్రకాశ్ కరత్

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 68 | విజయవాడ, మంగళవారం 8 అక్టోబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 8 October 2024 | Rs

మైక్రో ఆర్ఎన్ఎను కనుగొన్న అమెరికన్ ద్వయానికి

వైద్యంలో నోబెల్

విక్టర్ ఆంబ్రోస్



గ్యారీ రూవ్‌కున్

స్టాక్‌హోం : జన్యు కార్యకలాపాలను నియంత్రించే ప్రాథమిక సూత్రమైన మైక్రో ఆర్ఎన్ఎను కనుగొన్నందుకు అమెరికన్ ద్వయం విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రువ్‌కున్‌లకు వైద్యంలో నోబెల్ పురస్కారం లభించింది. సోమవారం స్వీడన్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నోబెల్ కమిటీ చైర్మన్ థామస్ పెర్ల్‌మాన్ ఈ ఏడాది తొలి నోబెల్ పురస్కారాన్ని ప్రకటించారు. వివిధ రకారల జీవులు ఎలా అభివృద్ధి చెందుతాయి, ఎలా పనిచేస్తాయి అనేదానికి మైక్రో ఆర్ఎన్ఎ కీలకమని వీరు తమ అధ్యయనంలో నిరూపించారని నోబెల్ కమిటీ పేర్కొంది. జన్యు చర్యల నియంత్రణను అవగాహన చేసుకోవడమనేది అనేక దశాబ్దాలుగా కీలక లక్ష్యంగా వుందని, ఈ జన్యు నియంత్రణ గనక అవకతవకలతో సాగినట్లైతే కేన్సర్, మధుమేహం లేదా ఆటో ఇమ్యూనిటీ వంటి తీవ్రమైన వ్యాధులకు దారి తీయగలదని నోబెల్ అకాడమీ పేర్కొంది. తనకు బహుమతి సాధించిపెట్టిన పరిశోధనను ఆంబ్రోస్ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఉండగా నిర్వహించాడు. ఆయన ప్రస్తుతం మసాచుసెట్స్ యూనివర్సిటీ మెడికల్ స్కూల్‌లో నేచురల్ సైన్స్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. గ్యారీ రూవ్‌కున్ తన పరిశోధనను మసాచుసెట్స్ జనరల్ ఆస్పత్రి, హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో నిర్వహించారు. ఆయన ప్రస్తుతం హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారని పెర్ల్ మాన్ తెలిపారు. గత సంవత్సరం మెడిసిన్‌లో నోబెల్ బహుమతి హంగేరియన్- అమెరికన్ కటాలిస్ కారికో, అమెరికన్ డ్రూ వీస్‌మాన్‌లకు లభించింది. ఈ అవార్డు కింద కోటి పది లక్షల స్వీడిష్ క్రోనార్లు (10 లక్షల డాలర్లు) నగదు బహుమతిని డిసెంబరు 10న అందజేస్తారు. ఈ ఏడాది నోబెల్ బహుమతుల సీజన్‌లో ఇది మొదటిది. మంగళవారం భౌతిక శాస్త్రం, బుధవారం రసాయన శాస్త్రం, గురువారం సాహిత్యం, శుక్రవారం శాంతి బహుమతి, వచ్చే సోమవారం అంటే అక్టోబరు 14న అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారాలను ప్రకటిస్తారు.

అత్యున్నత పురస్కారం నోబెల్ పుట్టుక ఇలా.....

ప్రపంచంలోనే అత్యున్నత పురస్కారంగా నోబెల్‌కు గుర్తింపు ఉంది. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, వ్యాపారవేత్త అల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ఈ నోబెల్ పురస్కారాన్ని ప్రవేశపెట్టారు. 1896లో ఆయన మరణించగా, ఆ తర్వాత ఐదేళ్లకు అంటే 1901 నుండి మానవాళి ప్రయోజనాల కోసం విశేషంగా సేవలందించిన వారికి ఈ పురస్కారాన్ని అందజేస్తున్నారు. ఆయన తన జీవితకాలంలో సంపాదించిన యావదాస్తిని ఒక నిధిగా ఏర్పాటు చేసి ఈ బహుమతులు అందజేస్తున్నారు. భౌతిక, రసాయన శాస్త్రాలు, వైద్య, సాహిత్య, రంగాలు, ప్రపంచ శాంతి కోసం పాటుపడిన వారికి ఈ అవార్డులు అందజేయాలని నోబెల్ తన వీలునామాలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. నార్వే పార్లమెంట్ ఎంపిక చేసిన ఐదుగురు వ్యక్తులతో ఏర్పడిన కమిటీ నోబెల్ శాంతి బహుమతిని అందజేయాలని నోబెల్ తన వీలునామాలో పేర్కొన్నారు.

1897 ఏప్రిల్‌లో ఈ బాధ్యతను పార్లమెంట్ ఆమోదించింది. నోబెల్ గౌరవార్థం ఆర్థిక రంగంలో పురస్కారాన్ని 1969 నుండి బ్యాంక్ ఆఫ్ స్వీడన్ ద్వారా అందజేస్తున్నారు. నోబెల్ చనిపోయిన డిసెంబరు 10వ తేదీన ఈ బహుమతులను స్టాక్‌హోమ్‌లో జరిగే కార్యక్రమంలో అందచేస్తారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

ప్రజాశక్తి-సంబేపల్లి (రాయచోటి టౌన్)

అన్నమయ్య జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. సంబేపల్లి మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన పలువురు వ్యవసాయ కార్మికులు ఎస్.సోమవరం గ్రామానికి చెందిన రైతు పొలంలో టమోటా పంట కోసేందుకు కూలి పనులకు వెళ్లారు. భారీ ఈదురుగాలులకు తోడు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడింది. దీంతో కార్మికులు శెట్టిపల్లి మల్లీశ్వరమ్మ (43), శెట్టిపల్లి శంకరమ్మ (40) అక్కడికక్కడే మృతి చెందారు. కార్తీక్, రెడ్డమ్మ, మంగమ్మ, జయమ్మ, అమర్నాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కార్తీక్ పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించారు. మృతుల కుటుంబ సభ్యులను, గాయపడిన వారిని అన్ని విధాలా ఆదుకుంటామని విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి మృతుల కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడి భరోసానిచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.పది లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

'ఉక్కు' ఊసు లేదా...!

- ప్రధానితో ముగిసిన సిఎం భేటీ
- డిసెంబర్‌లో వైజాగ్ రైల్వే జోన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన మంత్రి నరేంద్రమోడీతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం జరిపిన భేటీలో విశాఖ ఉక్కు అంశం ప్రస్తావనకే రాలేదా? ... వచ్చినా ప్రధాన మంత్రి స్పందించలేదా? ఈ విషయమై సందిగ్ధత నెలకొంది. దాదాపు గంటపాటు ప్రధానితో ఆయన నివాసంలో జరిపిన చర్చల అనంతరం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చేసిన పోస్టులో ఈ అంశాన్ని ముఖ్యమంత్రి పేర్కొనపోవడమే దీనికి కారణం. భేటీ అనంతరం 'ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో ఫలవంతమైన సమావేశం జరిగింది. పోలవరం ప్రాజెక్టు సవరించిన ఖర్చు అంచనాలకు కేబినెట్ ఆమోదం తెలిపినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపాను. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ఆయనకు వివరించాను. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడికి సంబంధించిన విషయాలలో కేంద్ర ప్రభుత్వం మద్దతు, హామీకి నేను కతజ్ఞతలు తెలిపాను. రాజధాని నగరం అమరావతికి ఆయన మద్దతును అభినందించాను" అంటూ చంద్రబాబు నాయుడు ఎక్స్‌లో పేర్కొన్నారు. దీంతో చంద్రబాబు ప్రధానికి ఏ విషయాలు వివరించిఉంటారన్న అంశం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారిన తిరుమల నెయ్యి కల్తీ వ్యవహారాన్ని ఆయన ఖచ్చితంగా ప్రధాని దృష్టికి తీసుకువెళ్లి ఉంటారని భావిస్తున్నారు. ఈ కల్తీ వ్యవహారంలో వైసిపి నేతల ప్రమేయం ఉందని చంద్రబాబుతో పాటు, పలువురు రాష్ట్ర మంత్రులు ఆరోపించిన విషయం, అనంతరం చోటు చేసుకున్న పరిణామాల్లో సుప్రీంకోర్టు ప్రత్యేక సిట్‌కు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ అంశం దేశ వ్యాప్తంగా కలకలం రేపడంతో చంద్రబాబు దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని అంటున్నారు. ఈ నేపథ్యంలో తిరుమల నెయ్యి అంశం ఇరువురు నేతల మధ్య ఖచ్చితంగా చర్చకు వచ్చిఉంటుందని భావిస్తున్నారు. ఈ కల్తీ అంశం తరువాత రాష్ట్రంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటమే చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఉక్కు పరిశ్రమలో వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలతో మిగతా 7లో

మహాచండీదేవిగా దుర్గమ్మ

2లో..

రహదారుల మరమ్మతులకు రూ.290 కోట్లు

- తొలిదశలో 1,393 రోడ్లకు 7,071 కిలోమీటర్ల మరమ్మతులు
- ఆర్అండ్‌బి శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి

3లో..

వరద బాధితులకు సేవచేసిన మున్సిపల్ కార్మికులకు నెల జీతం బోనస్‌గా ఇవ్వాలి

సిడిఎంఎకు ఫెడరేషన్ విజ్ఞప్తి

2లో..

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

త్వరలో నూతన కౌల్దారుల చట్టం

- భూ యజమానుల హక్కులకు నష్టం లేకుండా కౌల్దార్లకు న్యాయం జరిగేలా చర్యలు
- ముసాయిదా చట్టంపై సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- గుంటూరు

రాష్ట్రంలో అందరి ఆమోదంతో పకడ్బందీగా నూతన కౌల్దారుల చట్టాన్ని తీసుకొస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు తెలిపారు. నూతన చట్టం ముసాయిదాపై సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో ఐదు జిల్లాల ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల నుండి రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 90 శాతం భూమి కౌలుదారులే సాగు చేస్తున్నారని, గత ప్రభుత్వం కౌల్దార్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని పేర్కొన్నారు. 2011 కౌల్దార్ల చట్టాన్ని టిడిపి ప్రభుత్వం అమలు చేసిన ఫలితంగా 40 శాతం కౌల్దార్లకు కార్డులు, రుణాలు దక్కాయన్నారు. అదే చట్టాన్ని కొనసాగిస్తే దాదాపు 70-80 శాతం మందికి న్యాయం జరిగి ఉండేదన్నారు. కానీ గత ప్రభుత్వం 2019లో తెచ్చిన చట్టంలో కౌలు రైతుల గుర్తింపు కార్డు కోసం భూ యజమాని సంతకం ఉండాలనే దుర్మార్గమైన క్లాజు విధించిందని, దీని వల్ల భూ యజమానులు భయపడ్డారని, కౌలు రైతులకు కార్డులు మిగతా 7లో

విశాఖ ఉక్కు ప్రైవేటీకరించకుండా

మోడీని ఒప్పించాలి

- చంద్రబాబుకు వి శ్రీనివాసరావు సూచన

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయకుండా, ప్రభుత్వరంగంలోనే పరిరక్షించేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీని ఒప్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు సూచించారు. విశాఖలోని మద్దిలపాలెంలో సీతారాం ఏచూరి స్మారక భవన నిర్మాణ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా సోమవారం విచ్చేసిన ఆయన మీడియా తో మాట్లాడుతూ ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి ఈ విషయమై దృష్టి సారించాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయకుండా మోడీచేత నిర్ణయం చేయించి, ఐదు కోట్ల మంది ప్రజల డిమాండ్‌ను నెరవేర్చాలన్నారు. ఇప్పటికే 'ఉక్కు' పరిరక్షణకు మూడేళ్లుగా పలు రూపాల్లో పోరాడుతూ కార్మికులతో పాటు సిపిఎం, వామపక్షాలు కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయని తెలిపారు. కేంద్రంలో అధికారంలో భాగస్వామి అయిన చంద్రబాబు లాంటి వారు నేటి తరుణంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేస్తున్నట్లు కేంద్రంతో ప్రకటింపజేయాలని కోరారు. రాష్ట్రంలో ఎక్కడా లేనిరీతిలో విశాఖ ప్రజలు కూటమి పార్టీలకు, అందులోనూ గాజువాక నియోజకవర్గంలో టిడిపికి భారీ మెజారిటీ కట్టబెట్టారన్నారు. రెండు నెలలగా స్టీల్‌ప్లాంట్‌లోని మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లను పూర్తిగా పనిలోకి తీసుకురావాలని, కాంట్రాక్టు కార్మికులను తొలగించే ప్రక్రియను నిలిపేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఈ విషయాలను ప్రస్తావించకపోయినా, కేంద్రం నుంచి సరైన స్పందన రాకపోయినా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్వహించే భవిష్యత్తు పోరాటాలకు సిపిఎం, వామపక్షాలు పూర్తి మద్దతు ఇస్తాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చి కర్మాగారాన్ని కాపాడుకుంటామని తెలిపారు.

ఏచూరి స్మారక భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న వి శ్రీనివాసరావు

ఉద్యమ కేంద్రంగా ఏచూరి స్మారక భవనం

3

ఆరో రోజూ అమ్మకాల వెల్లువ

- సెన్సెక్స్ 638 పాయింట్ల పతనం
- వీడని యుద్ధ భయాలు



ముంబయి : వరుసగా ఆరో రోజూ దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల జోరు కొనసాగింది. సోమవారం ఉదయం ఆశాజనకంగా లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఓ దశలో అమ్మకాలు ముమ్మరంగా సాగడంతో బిఎస్ఇ సెన్సెక్స్ 962 పాయింట్ల పతనాన్ని చవి చూసింది. తుదకు 638 పాయింట్లు లేదా 0.78 శాతం క్షీణించి 81,050కు పడిపోయిం ది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 218 పాయింట్లు లేదా 0.87 శాతం తగ్గి 24,795 వద్ద నమోదయ్యింది. ప్రధానంగా ఎఫ్ఐఐల అమ్మకాలు, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య వీడని ఉద్రిక్తతల భయాలు తదితర కారణాలతో మార్కెట్లు నేల చూపులు చూశాయి. ప్రధాన స్టాక్స్ అయినా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్ 2.09 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ 1.17 శాతం పతనం కావడంతో మార్కెట్లపై మరింత ఒత్తిడి చోటు చేసుకుంది. ఎన్‌టిపిసి, యాక్సిస్ బ్యాంక్, ఎల్అండ్‌టి, అదానీ పోర్ట్స్ షేర్లు అధికంగా 4 శాతం వరకు విలువ కోల్పోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు ఐటిసి, భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడిన వాటిలో ఉన్నాయి. బిఎస్ఇలో స్మాల్ క్యాప్ సూచీ 3.86 శాతం, మిడ్ క్యాప్ 2.61 శాతం చొప్పున నష్టపోయాయి.

తరలిన రూ.37 వేల కోట్ల ఎఫ్ఐఐలు

గడిచిన ఆరు సెషన్లలో భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.37,000 కోట్ల విలువ చేసే ఎఫ్ఐఐలను తరలించుకు పోయారు. ఆర్థిక వృద్ధి కోసం చైనా కీలక నిర్ణయాలు చేపట్టడమే ఇందుకు ప్రధాన కారనమని నిపుణులు భావిస్తున్నారు. ఇది భారత మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడింది. ఆరు సెషన్లలో సెన్సెక్స్ 4,786 పాయింట్లు క్షీణించింది.

నేడు తెరుచుకోనున్న చైనా మార్కెట్లు

7

ఇజ్రాయిల్‌ది సామ్రాజ్యవాద దురహంకారం

పాలస్తీనా సంఘీభావ సదస్సులో వక్తలు

సభలో మాట్లాడుతున్న బాబూరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఒక జాతిని అంతం చేయాలనే ఉద్దేశంతో పాలస్తీనాపై దాడిచేసి వేలాది మందిని పొట్టనబెట్టుకున్న ఇజ్రాయిల్‌ది సామ్రాజ్యవాద దురహంకారమని, ప్రపంచ చరిత్రలో సామ్రాజ్యవాద యుద్ధాలు ఇప్పటి వరకు విజయం సాధించలేదని పలువురు వక్తలు అన్నారు. పది వామపక్ష పార్టీల ఆధ్వర్యాన సోమవారం ఉదయం విజయవాడ బాలోత్సవ భవన్లో 'గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి, పాలస్తీనా సంఘీభావం' అనే అంశంపై సభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ కేవలం పాలస్తీనాను ఆక్రమించు కోవాలనే దురుద్దేశంతోనే ఇజ్రాయిల్ ఇష్టారాజ్యంగా బాంబులు కురిపించి వేల మందిని పొట్టనబెట్టుకుం దన్నారు. అధికారికంగానే 45 వేలమంది చనిపోయా రని చెబుతున్నారని, వారిలో 16 వేలమంది చిన్నారులేనని తెలిపారు. అరబ్ దేశాలపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడి వెనుక అమెరికా, యూరప్‌లోని కొన్ని సామ్రాజ్యవాద దేశాలు ఉన్నాయని, వారే మారణా యుధాలు సరఫరా చేస్తూ వేలమంది ప్రజల మరణానికి కారణమయ్యారని చెప్పారు. ముఖ్యంగా ఆయిల్ ప్రధానంగా ఉండే దేశాల్లో పట్టుకోసం ఇది అమెరికా చేస్తున్న యుద్ధమని ఆయన అన్నారు. దీని ప్రభావం ప్రపంచ ఆర్థిక, రాజకీయ అంశాలపై పడుతుందని, ప్రజలపైన కూడా భారం పడుతుందని చెప్పారు. టెర్రరిజంపై యుద్ధం చేస్తున్నామని చెబుతన్న అమెరికా, ఇజ్రాయిల్‌లే అతిపెద్ద టెర్రరిస్టు దేశాలని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవీంధ్రనాథ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద సామ్రాజ్యవాద, యుద్ధోన్మాద దేశాలు ఏడాది కాలంగా పోరాడుతున్నా గాజా ప్రజలు ఇంకా అడ్డుకుంటూనే ఉన్నారని, అటువంటి వారికి ప్రపంచవ్యాప్తంగా సంఘీభావం తెలపవలసిన అవసరం ఉందని అన్నారు. అమెరికా మద్దతు ఇచ్చే యుద్ధోన్మాదులు మాత్రమే ఇజ్రాయిల్ దురాగతాలను స్వాగతిస్తున్నా రని చెప్పారు. సిపిఐఎంఎల్ న్యూడెమెక్రసీ నాయకులు పి.ప్రసాదు మాట్లాడుతూ అమెరికాతో పాటు దాని అనుబంధ సామ్రాజ్యవాద దేశాలు జరిపిన అన్ని యుద్ధాల్లోనూ ఓడిపోయాయని అన్నారు. కేవలం ఆయుధ సామాగ్రిని అమ్ముకోవడం కోసం ప్రజల ప్రాణాలను తీయడానికి వెనుకాడటం లేదని అన్నారు. సిపిఐఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్‌బాబు మాట్లాడుతూ అమెరికా లాంటి దేశాలు వారి లాభల కోసం ఆయు ధాలతోపాటు యుద్ధాలను తయారు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్‌యుసిఐసి నాయకులు సుధీర్, ఎంసిపిఐ నాయకులు సలీమ్, ఆర్ఎస్‌పి నాయకులు రవికాంత్ తదితరులు మాట్లాడారు. సభకు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షత వహించారు. ప్రజానాట్యమండలి నాయకులు సామ్రాజ్యవాద వ్యతిరేక గీతాలు ఆలపించారు. తొలుత ఇజ్రాయిల్ దాడుల్లో మృతిచెందిన వారికి రెండు నిముషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు.

ఎయిర్‌షో మృతుల కుటుంబాలకు

రూ.5 లక్షల పరిహారం

చెన్నై : చెన్నై ఎయిర్‌షోలో అస్వస్థతకు గురై మరణించిన ఐదుగురి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ప్రకటించారు. విపరీతమైన వేడి, ఇతర వైద్య కారణాల వల్ల ఐదుగురు తమ విలువైన ప్రాణాలు కోల్పోవడం విచారకరమని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆదివారం నిర్వహించిన ఎయిర్‌షోకు సంబంధించి ఐఎఎఫ్ అభ్యర్థనకు మించి ప్రభుత్వం సహకరించిందని, పోలీస్, ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్లు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, హెల్త్ డిపార్ట్‌మెంట్ సమన్వయం చేసుకుని అవసరమైన ఏర్పాట్లు చేయడం వల్లే తొక్కిసలాట జరగలేదని తెలిపారు. ఊహించినదానికంటే ఎక్కువమంది తరలిరావడంతో వారు తమ వాహనాల వద్దకు, బస్సుల వద్దకు వెళ్లడానికి ఇబ్బందిపడ్డారని వివరించారు. ఈ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వరద బాధితులకు సేవచేసిన మున్సిపల్ కార్మికులకు నెల జీతం బోనస్‌గా ఇవ్వాలి

- సిడిఎంఎకు ఫెడరేషన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బుడమేరు వరద ముంపులో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన వివిధ మున్సిపాలిటీలకు చెందిన ఎనిమిది వేల మంది మున్సిపల్ కార్మికులకు ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. మున్సిపల్ శాఖ కమిషనర్ ఎం.హరినారాయణన్‌ను తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కలిసి, మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు. వరదల్లో చిక్కుకుని సర్వం కోల్పోవడం వల్ల విధులకు హాజరు కాలేకపోయిన కార్మికులకు 12 రోజుల జీతం కోత పెట్టడం అన్యాయమని అన్నారు. ఈ విషయంలో వారికి సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ శాఖ కమిషనర్ హరినారాయణ, విజయవాడ మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి కార్మికుల జీతాల్లో కోత పెట్టిన విషయాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినతిపత్రం అందించిన వారిలో ఫెడరేషన్ కోశాధికారి ఎస్.జ్యోతిబసు, నాయకులు జె.నాగరాజు ఉన్నారు.

మద్యం షాపుల డ్రాలో ఇతర రాష్ట్రాల వారికీ అవకాశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూతన మద్యం షాపుల డ్రాలో ఇతర రాష్ట్రాల వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఎక్సైజ్‌శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ముకేష్ కుమార్ మీనా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర రాష్ట్రాల వారు దరఖాస్తు చేసుకునేందుకు, అక్కడి బ్యాంక్‌లలో తీసిన రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ డిడిలు, సిఎఫ్‌ఎంఎస్ అందించిన సిటిజన్ చలాన్‌లను ఆమోదించాలని క్షేత్రస్థాయి నుంచి అభ్యర్థనలు రావడంతో ఈ మేరకు నోటిఫికేషన్‌లో సవరణలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాల్లోని అధికారులు ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

అడవి జంతువులకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి ఎఎస్ఐ మృతి

ప్రజాశక్తి-సీలేరు, మోతుగూడెం(అల్లూరిజిల్లా)

మృతిచెందిన తిరునావక్ అరసు

అల్లూరి సీతారామరాజు జిల్లా డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తున్న సిఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ తిరునావక్ అరసు (55) విద్యుదాఘాతంతో మృతిచెందారు. అడవి జంతువుల కోసం వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి మరణించారు. డొంకరాయి పోలీసుల కథనం మేరకు.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిఆర్‌పిఎఫ్ 42వ బెటాలియన్ విస్తృత తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలోనే డొంకరాయి నుంచి మెట్టగూడెం గ్రామ శివారు అటవీ ప్రాంతానికి వెళ్తుండగా విద్యుదాఘాతానికి గురై తిరునావక్ అరసు మృతిచెందారు.

జంతువుల కోసం అమర్చిన విద్యుత్ వైర్లు తగిలి ఆయన చనిపోయినట్టు సహచర పోలీసులు తెలిపారు. మృతుడు తమిళనాడు రాష్ట్రానికి చెందిన సేలం జిల్లా వీరకుట్టిపాళ్యంకు చెందినవారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలస్తీనాకు అండగా ఉందాం

- వామపక్ష పార్టీల ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, పాలస్తీనాకు అండగా ఉండామని కోరుతూ వామపక్షాలు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టాయి. ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించాయి. ఇజ్రాయిల్ దురాగతాలను ఖండించాయి. ఇజ్రాయిల్ దాడుల్లో వేలాది మంది పాలస్తీనా పౌరులు మరణించారని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖలో వామపక్షాల ఆధ్వర్యాన శాంతి ప్రదర్శన, అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు జరిపి, మారణహోమం సృష్టించి నేటికి సంవత్సరమైనా, ఐక్యరాజ్య సమితి అక్కడ శాంతి నెలకొల్పాలని ఆదేశించినా అమెరికా మద్దతుతో చెలరేగిపోతున్న ఇజ్రాయిల్ దుర్మార్గాలను అందరూ ఖండించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ఇంటిపై వైసిపి వారు దాడి చేస్తే రాష్ట్ర ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించారని గుర్తుచేస్తూ, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడుల్లో చిన్నపిల్లలు, మహిళలు మరణించారని, లక్షమంది క్షతగాత్రులయ్యారని, ఈ రోజుకీ చంద్రబాబు ఒక్కసారి కూడా ఆ దాడులు తప్పు అని అనలేదని తెలిపారు. ఇప్పటివరకు మన దేశంలో ఎవరు అధికారంలో ఉన్నా పాలస్తీనాకు మద్దతుగానే ఉన్నారని, చంద్రబాబు మద్దతు ఇస్తోన్న మోడీ తప్పు... దేశ, ప్రపంచ వ్యాపితంగా ప్రజలందరూ ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తున్నారని అన్నారు. అయినా, చంద్రబాబులో చలనం రాలేదని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా

అనంతపురంలో నిర్వహించిన శాంతి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సిపిఎం నాయకులు

కార్యదర్శి వై.కొండయ్య, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి ఎస్.గోవిందరాజులు, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు నాయకులు దేవా పాల్గొన్నారు. అనంతపురంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పాల్గొని ప్రసంగించారు. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండల కేంద్రంలో శాంతి ప్రదర్శన నిర్వహించారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ దినం పాటించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. గుంటూరులో పాత బస్టాండ్ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్‌లో క్యాండిల్స్ ర్యాలీ నిర్వహించారు. నరసరావుపేటలో ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన నిరసన ర్యాలీలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్లో సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో ర్యాలీ నిర్వహించారు. విజయనగరం, బొబ్బిలిలో రాస్తారోకో చేశారు.

పార్వతీపురంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మధరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ర్యాలీగా వచ్చి ఈ కార్యక్రమం చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సిపిఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, సిపిఐ (ఎంఎల్) నాయకులు రమణ పాల్గొన్నారు. తిరుపతిలో పాలస్తీనా సంఘీభావ సదస్సు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, సిపిఐ ఎంఎల్ నాయకులు సత్తార్, సిపిఐ నాయకులు చిన్నం పెంచులయ్య, కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి, వైసిపి నాయకులు సయ్యద్ షఫీ మహ్మద్ ఖాదరీ పాల్గొన్నారు. రేణిగుంటలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.

దసరా ఉత్సవాల పర్యవేక్షణకు రామచంద్రమోహన్ నియామకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల పర్యవేక్షణకు దేవాదాయశాఖ అదనపు కమిషనరు కె రామచంద్రమోహన్‌ను నియమించినట్లు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో కీలకమైన చివరి నాలుగు రోజుల్లో యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటంతోపాటు అన్ని విభాగాలనూ సమన్వయపరుచుకునేందుకు ఆయనను నియమించినట్లు మంత్రి తెలిపారు. దసరా ఉత్సవాలను రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందన్నారు. ముఖ్యంగా ఈ నెల 9న కనకదుర్గమ్మ జన్మనక్షత్రం కావడంతో దేశం నలుమూలల నుంచి యాత్రికులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనం కల్పించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు.

మహాచండీదేవిగా దుర్గమ్మ

ప్రజాశక్తి - వన్‌టౌన్, విజయవాడ, విజయవాడ అర్బన్

సారె సమర్పిస్తున్న శ్రీకాళహస్తీశ్వర దేవస్థాన ప్రతినిధులు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మహాచండీ దేవిగా దుర్గమ్మను అలంకరించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు యాత్రికులు తరలివచ్చారు. సుమారు 75 వేల మందికి పైగా దుర్గమ్మను దర్శించుకున్నట్లు సమాచారం. మూలానక్షత్రం రోజైన బుధవారం సరస్వతీదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శించుకునేందుకు లక్షలాది మంది యాత్రికులు తరలివస్తారని దేవాలయ అధికారులు పేర్కొన్నారు. మంగళవారం మహాలక్ష్మీ దేవిగా అమ్మవారిని అలంకరించనున్నారు. తిరుపతి జిల్లా కాళహస్తీశ్వర దేవస్థాన ప్రతినిధులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు.

పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసి పాత్ర కీలకం

- సమగ్ర శిక్షా డైరెక్టరు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసి) కీలక పాత్ర వహించాలని సమగ్ర శిక్షా డైరెక్టరు బి శ్రీనివాసరావు తెలిపారు. ఎంఎస్‌సి రాష్ట్ర రిసోర్సుపర్సన్లకు శిక్షణ కార్యక్రమం గుంటూరు జిల్లా పెదపరిమి ముద్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టరు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధిలో భాగంగా అభ్యసన ఫలితాలపై దృష్టి సారించాలని సూచించారు. పాఠశాల పనితీరు, విద్యార్థుల అభ్యసన స్థాయి, విద్యార్థుల మరుగుదొడ్ల వినియోగం, ప్రభుత్వ పథకాలు అమలు, హాజరుశాతం వంటి వాటిపై ఎస్ఎంసి సభ్యులు పర్యవేక్షించాలన్నారు. ఎస్ఎంసిలకు ప్రత్యేకమైన మొబైల్ యాప్ రూపొందిస్తున్నామని తెలిపారు. సమస్యలను నేరుగా సభ్యులే అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చని చెప్పారు. సమగ్రశిక్షా, పాఠశాల విద్యాశాఖ రూపొందించిన ఎస్ఎంసి కరదీపికను డైరెక్టరు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఏలూరు జిల్లా ఆగిరపల్లి హీల్ ప్యారడైజ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మరో శిక్షణ కేంద్రంలో సీమ్యాట్ డైరెక్టరు విఎన్ మస్తానయ్య పాల్గొన్నారు.

'జూడో'లో కాంస్య పతకాలు

జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ 'జూడో'లో అండర్-14 బాలురు విభాగంలో రాష్ట్రానికి రెండు కాంస్య పతకాలు సాధించినట్లు రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి భానుమూర్తి తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన 68వ జాతీయ స్కూల్ గేమ్స్ ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు గుజరాత్‌లో జరిగాయని సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 25 కేజీల విభాగంలో శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం, నసన్నకోట జిల్లా పరిషత్ ఉన్నత (జెడ్‌పిహెచ్) పాఠశాలకు చెందిన మాస్టర్ తలారి జయసింహ, 50 కేజీల విభాగంలో సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం సిగిచర్ల జెడ్‌పిహెచ్ పాఠశాలకు చెందిన మాస్టర్ సయ్యద్ పతకాలు సాధించారని వివరించారు. క్రీడాకారులను, టీం కోచ్, మేనేజర్లను పాఠశాల విద్యాశాఖ డైరెక్టరు కృతికా శుక్లా, సమగ్ర శిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావు అభినందించారని పేర్కొన్నారు.

మరో కేసులో మాజీ ఎంపి నందిగం అరెస్టు, రిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

వైసిపి మాజీ ఎంపి నందిగం సురేష్‌ను పోలీసులు మరోసారి అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి కోర్టులో సోమవారం తుళ్లూరు పోలీసులు ఆయనను ప్రవేశ పెట్టారు. టిడిపి కార్యాలయంపై దాడి కేసులో నందిగం సురేష్ ఇప్పటికే గుంటూరు జైల్లో ఉన్నారు. ఇటీవల హైకోర్టు సురేష్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చింది కానీ పూచీకత్తు సమర్పించకపోవడంతో ఆయన జైలులోనే ఉన్నారు. మరో వైపు మంగళగిరి కోర్టు పిటి వారెంట్‌కు అనుమతించడంతో తాజాగా మరియమ్మ అనే మహిళ హత్యకేసులో ఆయనను పోలీసులు అరెస్టు చేసి మంగళగిరి కోర్టులో ప్రవేశ పెట్టారు. న్యాయస్థానం సురేష్‌కు ఈ నెల 21 వరకు (14రోజులు) రిమాండ్ విధించింది. 2020లో వెలగపూడిలో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణలో మరియమ్మ మరణించారు. దీనిపై అప్పట్లో కేసు నమోదైంది. వైసిపి ఎంపిగా ఉన్న నందిగం సురేష్ పేరునూ ఈ కేసులో చేర్చారు. వైసిపి అధికారంలో ఉండడంతో కేసు విచారణ ముందుకు సాగలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విచారణ ప్రారంభమైంది.

పౌరసరఫరాలకు రూ. 17,500 కోట్లు

- భారీ ప్రతిపాదనలు సిద్ధం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పౌరసరఫరాల శాఖకు ఈ ఏడాది మార్చి వరకు ఏకంగా 17,500 కోట్ల రూపాయలు అవసరమౌతాయని అంచనా వేశారు. ఈ మేరకు ఆ శాఖ అధికారులు రూపొందించిన నివేదికలు ఆర్థికశాఖకు చేరాయి. దీనిలో ధాన్యం సేకరణ కోసమే దాదాపుగా 10 వేల కోట్ల రూపాయలు అవసరమౌతాయని ప్రతిపాదించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాల్సిఉంటుందని, దాని కోసం ఈ మొత్తం అవసరమౌతుందని పేర్కొన్నారు. దీనిలో రైతులకు 8,816 కోట్ల రూపాయల వరకు చెల్లించాల్సి ఉంటుందని, మిగిలినది ఇతర అవసరాల కోసం ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. రాగి, జొన్న, కంది సేకరణకు 150 కోట్లు, గతంలో తీసుకున్న రుణాలపై వడ్డీలు, అసలుకు వాయిదాలకు కలిపి రూ.3,878 కోట్లు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జాతీయ సహకారాభివృద్ధి సంస్థ నుంచి తీసుకున్న ఇతర రుణాలకు చెల్లించాల్సిన అసలు, వడ్డీ బకాయిలకే మరో 3,200 కోట్లు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీనిలో వ్యయ మొత్తంలో కేంద్రం నుంచి సబ్సిడీ రూపంలో వచ్చేది కేవలం 3,520 కోట్లు మాత్రమేనని అధికారులు చెబుతున్నారు.

ఇందులో కూడా చివరకు ఎంత ఖజానాకు చేరుతుందో చెప్పలేమని వారంటున్నారు. ఈ మొత్తాన్ని ఈ అక్టోబర్ నుంచి నాలుగు వాయిదాల్లో కేంద్రం ఇవ్వాల్సి ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే గ్యారంటీల ద్వారానే రూ.6,500 కోట్లు రుణాలుగా తీసుకోవాలని పౌర సరఫరాల సంస్థ భావిస్తోంది. నబార్డ్ నుంచి రు.2,300 కోట్లు, జాతీయ సహకారాభివృద్ధి సంస్థ నుంచి రు. 4,200 కోట్లు సమీకరించాలని నిర్ణయించారు.

ధాన్యం, ఇతరాల సేకరణకు కావాల్సిన నిధుల వివరాలు (రూ.కోట్లలో)

ఖర్చుకు నిధుల అంచనా...	
ధాన్యం సేకరణకు	10,269
రాగి జొన్నకు	150
పిడిఎస్, వడ్డీ	3,878
ఎన్‌సిడిసి రుణాలకు	3,200
మొత్తం వ్యయం	**17,497**
అందుబాటులో నిధులు...	
రాష్ట్రం నుంచి	6,053
రుణాలుగా	6,500
ఇంకా చాలని నిధులు	4,944

గుంటూరులో పసికందు కిడ్నాప్

- కథ సుఖాంతం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

శిశువును తల్లికి అప్పగించిన ఎస్‌పి సతీష్‌కుమార్

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం అర్ధరాత్రి డెలివరీ అయిన బాలింత నుంచి పసికందును అపహరించిన ఘటన వెలుగుచూసింది. గుర్తు తెలియని మహిళ బాలింత కుటుంబ సభ్యుల నుంచి బేబీ బాగుందని చేతుల్లోకి తీసుకుంది. అనంతరం పక్కనే ఉన్న తన భర్తకు చూపించుకు వస్తానని పసికందును తీసుకొని వేగంగా వెళ్లింది. ఆ తర్వాత ఆమె మరో ఇద్దరితో కలసి ఆటో ఎక్కి పసికందుతో సహా ఉడాయించారు. కొద్దిసేపటికి విషయాన్ని తెలుసుకున్న బాలింత కుటుంబ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. గుంటూరు జిజిహెచ్ కాన్పుల వార్డులో గోరంట్లకు చెందిన షేక్ నసీమా (22)కి అబ్బాయి పుట్టాడు. బాలింత కుటుంబ సభ్యులను పరిచయం చేసుకొని సత్తెనపల్లికి చెందిన శిరీష మరో ఇద్దరితో కలిసి శిశువుని అపహరించారు. రంగంలోకి దిగిన కొత్తపేట పోలీసులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పసికందును గుర్తించటానికి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరులో ఉన్నట్లు గుర్తించారు. శిరీష్ తో పాటు ఆమెకు సహకరించిన ప్రేమ రాజు, మంగమ్మలను కూడా పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. పసికందును తల్లికి అప్పగించారు. గుంటూరు తూర్పు డిఎస్‌పి అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో గుంటూరు కొత్తపేట సిఐ వీరయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిషేధిత భూముల జాబితాలో అక్రమాలు

- సర్కార్ సీరియస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిషేధిత భూముల జాబితానుంచి పెద్ద ఎత్తున భూములను నిబంధనలకు విరుద్ధంగా తొలగించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ముఖ్యమంత్రి, రెవెన్యూమంత్రి ఇటీవల నిర్వహించిన ప్రజావేదికల్లో ఈ అంశానికి సంబంధించి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ విసయంలో వాస్తవాలను నిగ్గుతేల్చాలనే పట్టుదలతో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారుల అవినీతిని వెలికి తీసేందుకు ఆ జాబితాలతో పాటు వాస్తవంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న మార్కెట్ ధర ఎంత? ఎంత ఎక్కువ చెల్లించి కొనుగోలు చేశారు? ఆయాచిత లబ్ధి ఎవరికి చేకూర్చారు? ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు ఏ మేర చిల్లు పడింది? అనే అంశాలను పరిశీలించేందుకు ప్రభుత్వం జిల్లాల వారీగా "ఆడిట్" శాఖను రంగంలోకి దించింది. అవసరమైతే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను కూడా రంగంలోకి దించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.దీంతో త్వరలోనే అక్రమాలకు పాల్పడిన అధికారులపై వేటు తప్పదనే అభిప్రాయం రెవెన్యూ వర్గాల్లో వినబడుతోంది. ఇదే విషయంపై ఈనెల 1న సిఎం రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 3న సిసిఎల్‌ఎ కమిషనరు జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీంతో ఈ విషయంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందనే సంకేతాలు రెవెన్యూ అధికారులకు స్పష్టంగా వెళ్లాయి. ఇదే అంశంపై నిషేధిత భూముల జాబితానుంచి తొలగించిన భూములకు సంబంధించిన వివరాల నివేదికలను అందజేయాలని సిసిఎల్ఎ కమిషనరు జయలక్ష్మీ జిల్లాల జాయింట్ కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటికే సమర్పించిన వివరాలను పున:పరిశీలన చేయాలని ఆమె ఆదేశించారు. అంతే కాకుండా నిషేధిత భూములతో పాటు వాగులు, వంకలు, గ్రామ కంఠాలు, చెరువులు, కుంటల్లో ఉన్న భూములను సైతం కొందరు వ్యక్తులకు ఆయాచిత లబ్ధి చేకూర్చారనే ఆరోపణలు పెద్దఎత్తున వెల్లువెత్తాయి. ఇది ఇలా ఉంటే పేదలకు ఇంటి స్థలాలు, ఇంటి నిర్మాణాల పేరుతో జగనన్న కాలనీలకు గతప్రభుత్వం సేకరించిన భూములకు మార్కెట్ ధర కంటే అత్యధిక రెట్లు ప్రభుత్వం చెల్లించినట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధర ఎక్కువ ఉండే ప్రాంతంలోని సర్వే నెంబరు నమోదు చేసి ఎక్కడో మార్కెట్ ధర లేని ప్రాంతాల్లోని భూములను కూడా కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటన్నింటిపైపా విచారణకు ఆదేశించే అవకాశం ఉందని సమాచారం.

శంకరన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దళిత, గిరిజనుల అభివృద్ధికి విశేష కృషి చేసిన శంకరన్ : మాల్యాద్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళిత, గిరిజనుల అభ్యున్నతికి రిటైర్డు ఐఎఎస్ అధికారి ఎస్ ఆర్ శంకరన్ విశేష కృషి చేశారని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి పేర్కొన్నారు. శంకరన్ వర్ధంతి సందర్భంగా విజయవాడలోని అంబేద్కర్, జగ్జీవన్ ఐక్యతా భవన్ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి దళిత, ప్రజాసంఘాల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ.. తమిళనాడు రాష్ట్రంలో బ్రహ్మణ కుటుంబంలో పుట్టిన ఆయన ఐఎఎస్‌గా రాష్ట్రంలో అనేకచోట్ల పనిచేశారన్నారు. సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో దళిత, గిరిజనుల అభ్యున్నతికి అవసరమైన అనేక ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్ ఈ సందర్భంగా శంకరన్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు జి నటరాజు, చింతల శ్రీనివాస్, జి అరుణమ్మ, గడ్డం ఝాన్సీ, డిహెచ్‌పిఎస్ నాయకులు బి రాయప్ప, పేరయ్య, అశోక్, జై భీమ్ పార్టీ నాయకులు జి కొండలరావు, అంకయ్య, విల్సన్, జయకుమార్, సుబ్రమణ్యం, గుప్తా, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరకులు పంపిణీ చేస్తున్న జిఎస్ఆర్ యాజమాన్యం, రమాదేవి

వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

- పనులు కల్పించాలి : రమాదేవి

ప్రజాశక్తి-కొల్లూరు (బాపట్ల జిల్లా)

కృష్ణానది వరదల వల్ల ముంపుకు గురైన బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని పోతర్లంక గ్రామంలో గుంటూరు జిఎస్ఆర్ విద్యా సంస్థల సహకారంతో సిపిఎం ఆధ్వర్యంలో రూ.రెండు లక్షల విలువ చేసే నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకులు డి.రమాదేవి మాట్లాడుతూ.. వరదల వల్ల వచ్చిన విపత్తుతో లంక గ్రామ ప్రజలు పూర్తిగా నష్టపోయారన్నారు. ఇలాంటి సందర్భంలో జిఎస్ఆర్ విద్యాసంస్థలు పేద ప్రజలను ఆదుకోవడం కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. వరద బాధితులకు పనులు కల్పించి వెంటనే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జిఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ గోగినేని సాంబశివరావు, తోకలవానిపాలెం సర్పంచ్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శి శివ బాబు, సిపిఎం నాయకులు వేములపల్లి వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

శేషగిరిబాబుకు ఊరట

ప్రజాశక్తి-అమరావతి

కోర్టు ధిక్కార కేసులో ఇంటర్ బోర్డు గత కార్యదర్శి ఎంవి శేషగిరిబాబుకు హైకోర్టులో ఊరట లభించింది. నెలరోజుల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ఆరు వారాలపాటు నిలిపివేస్తూ డివిజన్ బెంచ్ స్టే విధించింది. విచారణను ఈ నెల 21కి వాయిదా వేస్తూ జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ నూనెపల్లి హరినాథ్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటర్ బోర్డులో పాలనాధికారి ఎం విజయలక్ష్మి ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లు చేయాలని గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును అమలు చేయలేదంటూ దాఖలైన కోర్టు ధిక్కారణ పిటిషన్‌లో పాఠశాల విద్యాశాఖ అప్పటి ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, బోర్డు కార్యదర్శి శేషగిరిబాబు ఇతరులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సింగిల్ జడ్జి తీర్పు చెప్పారు. దీనిపై శేషగిరిరావు అప్పీల్ దాఖలు చేయడంతో ఆ తీర్పుపై బెంచ్ ఆరు వారాల పాటు స్టే విధించింది.

హమాలీ కూలి రేట్ల పెంపు విషయంలో సంఘాలతో జాయింట్ మీటింగ్ పెట్టాలి

- ఎపి పౌరసరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

పౌర సరఫరాలశాఖ పరిధిలో మండల లెవల్ స్టాక్ పాయింట్లలో పనిచేస్తున్న 5 వేల మంది హమాలీల కూలి రేట్ల పెంపు విషయంలో ఏకపక్ష నిర్ణయాలు కాకుండా హమాలీ సంఘాలతో జాయింట్ మీటింగ్ పెట్టాలని ఎపి పౌర సరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. హమాలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. సోమవారం సివిల్ సప్లై ఎమ్‌డి మనజీర్ జిలాని సమూల్‌కు వినతిపత్రాన్ని హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత కూలి రేట్ల ఒప్పందం 2023 డిసెంబరు 31తో ముగిసిందని, 2024 జనవరి ఒకటి నుంచి కొత్త కూలి రేట్లు అమలు జరగాల్సి ఉందని అన్నారు. హమాలీల కూలి రేట్లను క్వింటాలుకు ప్రస్తుతం ఉన్న రూ.25 నుంచి నిత్యావసర సరుకుల ధరలు పెరుగుదలకు అనుగుణంగా రూ.40లకు పెంచాలని సిఐటియు అనుబంధ సంఘం హమాలీల రాష్ట్ర యూనియన్ కోరిందన్నారు. ఈ నెల 12న దసరా పండగ నేపథ్యంలో హమాలీలకు బోనస్ ఇవ్వాలని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. డిపార్టుమెంట్ అధికారులు హమాలీ సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రస్తుతం ఉన్న క్వింటాలుకు రూ.25 నుంచి రూ.27కు పెంచాలని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిసిందన్నారు. దసరా బోనస్ గత రెండు పర్యాయాలుగా పెంచలేదని, కానీ ప్రస్తుతం రూ.6 వేల నుంచి రూ.6,500లకు పెంచాలని ప్రతిపాదనలు ప్రతిపాదించినట్లు తెలిసిందని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్న సివిల్ సప్లై హమాలీలకు న్యాయబద్ధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా కూలిరేట్లు పెంచాలన్నారు. హమాలీల అంశంపై గత నెల 27న ఎమ్‌డితో చర్చలు జరిపామన్నారు. హమాలీల సంఘం అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్‌డి మనజీర్ జిలాని సమూల్ హామీ ఇచ్చినట్లు ఉమామహేశ్వరరావు తెలిపారు.

రైతులకు ధాన్యం వ్యాపారి కుచ్చుటోపీ !

- 50 మందికి రూ.2.50 కోట్లు ఎగవేత

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులకు ధాన్యం వ్యాపారి కుచ్చుటోపీ పెట్టాడు. మోసపోయిన బాధిత రైతులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఎనిమిది నెలలుగా కేసు నమోదు చేయకుండా కాలయాపన చేశారు. మనస్తాపానికి గురైన ఓ రైతు ఆత్మహత్యకు సైతం పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలోనే సోమవారం కృష్ణా జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)లో ఫిర్యాదు చేయడానికి బాధిత రైతులు తరలి వచ్చారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణాజిల్లా దివి ప్రాంతం అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లో బిపిటి 5204 రకం వరి వంగడాన్ని సాగు చేశారు. నాగాయలంక మండలం పర్రచివర గ్రామానికి చెందిన ధాన్యం వ్యాపారి బండ్రెడ్డి వెంకటేశ్వరరావు (బాబు) ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిల్లో పర్రచివర, పరిసర గ్రామాలకు చెందిన 50 మంది రైతుల నుంచి రూ.2.50 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశాడు. ధాన్యం అమ్మిన రైతులకు నేటికి నగదు చెల్లించలేదు. దీంతో తమకు నగదు ఇప్పించాలని కోరుతూ ఈ ఏడాది జూన్‌లో నాగాయలంక పోలీసులను రైతులు ఆశ్రయించారు. కానీ అక్కడ ఎటువంటి న్యాయమూ జరగలేదు.ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం మచిలీపట్నం కలెక్టరేట్‌లో కృష్ణా జిల్లా కలెక్టర్ డికె.బాలాజీకి వినతిపత్రం అందించారు.

22 మంది మావోయిస్టుల గుర్తింపు

- మృతిచెందిన వారి ఫొటోలు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్-దంతేవాడ జిల్లాల సరిహద్దులోని అడవుల్లో ఎదురు కాల్పుల్లో మృతిచెందిన 31 మంది మావోయిస్టుల ఫొటోలను సోమవారం దంతేవాడ జిల్లా ఎస్‌పి గౌరవ్ రాయ్ సోమవారం విడుదల చేశారు. మృతుల్లో 22 మందిని గుర్తించినట్టు తెలిపారు. వారిలో 13 మంది మహిళలు, 18 మంది పురుషులు ఉన్నారన్నారు. వారిలో నీతి అలియాస్ ఊర్మిళ డీకేఎస్‌జెడ్సీ, డీవీసీఎం ముగ్గురు, సీవైపీసి ఆరుగురు, పిపిసిఎంలు ఆరుగురు, ముగ్గురు ఎసిఎంలు, గార్డులు ఇద్దరు ఉన్నారని ఎస్‌పి వివరించారు. ఇంకా తొమ్మిది మంది మావోయిస్టులను పోలీసులు గుర్తించే పనిలో ఉన్నారని ఎస్‌పి చెప్పారు.

పైడితల్లమ్మ ఉత్సవాలకు స్పీకర్ ఓం బిర్లాకు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరంలో ఈ నెల 14, 15న నిర్వహించనున్న పైడితల్లి అమ్మవారి ఉత్సవాలకు రావాలని పార్లమెంట్ స్పీకర్ ఓం బిర్లాను ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు ఆహ్వానించారు. మాన్సాస్ ట్రస్టు చైర్మన్, కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు ఆహ్వానం మేరకు ఓం బిర్లాను ఎంపి కలిశెట్టి కలిశారు. ఎంతో విశిష్టత కలిగిన ఈ ఉత్సవాలకు తప్పనిసరిగా రావాలని స్పీకర్‌ను కోరారు.

లడ్డూ వ్యవహారంపై వైసిపి బుక్‌లెట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుపతి లడ్డూ వ్యవహారంలో వైసిపి ప్రత్యేక బుక్‌లెట్ తయారు చేసింది. అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు పేరుతో తయారు చేసిన ఈ బుక్‌లెట్‌ను సోమవారం పత్రికలకు విడుదల చేసింది. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుండే టిటిడి వేదికగా రాజకీయాలు మొదలుపెట్టారనే అంశంపై ఈ పుస్తకాన్ని తయారు చేశారు. టిటిడిపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారానికి చంద్రబాబు ప్లాన్ చేశారని అందులో పేర్కొన్నారు. లడ్డూ విధానం, టెండర్ల ప్రక్రియ, అమలు జరిపిన విధానంపై టైమ్‌లైన్‌ను అందులో పొందుపరిచారు. దీంతోపాటు వేర్వేరు పత్రికల్లో వచ్చిన క్లిప్పింగులనూ తేదీల వారీగా ప్రస్తావిస్తూ బుక్‌లెట్ రూపొందించారు. అలాగే లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా జరిగిన అంశాలు, తీర్పు కాపీకి సంబంధించిన వివరాలనూ ఈ బుక్‌లెట్లో ప్రస్తావించారు.

ఉద్యమ కేంద్రంగా ఏచూరి స్మారక భవనం

- విశాఖలో నిర్మాణ పనుల ప్రారంభంలో వి శ్రీనివాసరావు

సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ప్రజా ఉద్యమ కేంద్రంగా సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయాన్ని కామ్రేడ్ సీతారాం ఏచూరి స్మారక భవనం పేరుతో నిర్మించడం అభినందనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మద్దిలపాలెం కళాభారతి సమీపాన సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయ భవన నిర్మాణ ప్రారంభానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఇటీవల కన్నుమూసిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం భవన స్థలంలో ఇటుక, సిమెంటు వేసి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ జిల్లా ఉద్యమంతో సీతారాం ఏచూరికి ఎంతో అనుబంధం ఉందన్నారు. విశాఖ జిల్లాలోని ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటుపరం కాకుండా జరిగిన పోరాటాల్లో ఏచూరి కీలక పాత్ర పోషించారని వివరించారు.

2015లో విశాఖ జిల్లాలో జరిగిన సిపిఎం అఖిల భారత మహాసభలో పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. అందుకు ఆయన పేరుతో దేశంలోనే మొట్టమొదట కార్యాలయాన్ని విశాఖ జిల్లాలోనే నిర్మిస్తుండడాన్ని పార్టీ రాష్ట్ర కమిటీ తరపున అభినందించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డ్, బిహెచ్‌పివి వంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వాలు అమ్మేయడానికి, ప్రైవేటీకరించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తే, వాటిని సీతారాం ఏచూరి ఎలా అడ్డుకున్నదీ తెలియజేశారు. గతంలో ఇక్కడే ఉన్న పార్టీ కార్యాలయ భవనం ట్యూషన్ సెంటర్, కుట్టు మిషన్ కేంద్రం, మెడికల్ క్యాంపులకు నిలయంగా నిలిచి పిఠాపురం కాలనీ చుట్టుపక్కల ప్రజలకు ఎంతో అండగా నిలిచిందన్నారు. ప్రస్తుత భవనాన్ని త్వరగా పూర్తి చేయడానికి పార్టీ యంత్రాంగం పూనుకోవాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ సీతారాం ఏచూరి స్మారక భవనం పోరాటాల నిలయంగా మారనుందన్నారు. ప్రజలకు చేరువై విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు. పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, ఎంవిఎస్.శర్మ, విఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ విశాఖ జిల్లా కార్మికవర్గ ఉద్యమం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు సిపిఎం జాతీయ నాయకులు అనేకమంది కృషి చేస్తున్నారని, పార్టీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గళం ఎత్తుతున్నారని తెలిపారు. జివిఎంసిలో సిపిఎం కార్పొరేటర్‌గా డాక్టర్ బి.గంగారావు ఒక్కరే ఉన్నప్పటికీ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలనూ ఐక్యం చేయడంలోనూ, కార్పొరేషన్ కౌన్సిల్లో అజెండా పెట్టించి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేయించడంలోనూ కీలక పాత్ర పోషించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, బి.పద్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భవన నిర్మాణానికి పలు సంఘాల నాయకులు, వ్యక్తులు ఉదారంగా విరాళాలు ప్రకటించారు.

రహదారుల మరమ్మతులకు రూ.290 కోట్లు

- తొలిదశలో 1,393 రోడ్లకు 7,071 కిలోమీటర్ల మరమ్మతులు
- ఆర్అండ్‌బి శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మెరుగైన రోడ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రహదారులు, భవనాలశాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ధ్వంసమైన 7,071 కిలోమీటర్ల రహదారులకు సంబంధించిన 1,393 కిలోమీటర్ల రహదారులను గుంతల రహిత రహదారులుగా మార్చేందుకు రూ.290 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. 'రాష్ట్ర రహదారుల నిర్వహణ - పునరావాసం- సవాళ్లు- ఉత్తమ పద్ధతులు' అనే అంశంపై సోమవారం అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో రోడ్లు భవనాలశాఖ, ఎపి ఎస్ఆర్ఎం, సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లు సంయుక్తంగా రాష్ట్ర స్థాయి వర్కుషాప్ నిర్వహించాయి. ఈ వర్కుషాప్‌కు ఆశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే అధ్యక్షత వహించగా, మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి వీడియో సందేశాన్ని అందించారు. గుంతలు రహిత రోడ్లుగా మార్చేందుకు సరికొత్త టెక్నాలజీతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ విషయంలో ప్రభుత్వానికి ఎపి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సివిల్ ఇంజినీర్లు టెక్నాలజీ పరంగా సహకారం అందించేందుకు ముందుకు రావడం, ఎంఒయు కుదుర్చుకున్నామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వరదలు కారణంగా దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణకు రూ.186 కోట్లను రాష్ట్ర విపత్తు నివారణ నిధి నుంచి విడుదల చేశామన్నారు. రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే మాట్లాడుతూ.. రోడ్లు అధ్వాన స్థితికి చేరాయని, వీటి నిర్వహణ, పునరుద్ధరణ కోసం ప్రభుత్వం అస్సోం, గుజరాత్ రాష్ట్రాల్లో అధ్యయనం చేశాయన్నారు. రానున్న కాలంలో ఏడాదికి 9 వేల కిలోమీటర్ల మేరకు రోడ్లు బాగు చేయడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. సిఎస్ఐఆర్ సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసరు మనోరంజన్ పారిడా రోడ్ల నాణ్యతలకు సంబంధించిన పరిశోధనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ మనోజ్‌కుమార్ అరోరా, ఆర్అండ్‌బిశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నయిముల్లా, స్టేట్ హైవేస్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, వర్కుషాప్ కన్వీనరు ఉమామహేశ్వరరావు, బిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, వి వెంకటేశ్వరరావు, ఎస్ఆర్ఎం వర్సిటీ సివిల్ ఇంజినీర్లు రవితేజ, ప్రణవ్, భరత్ పాల్గొన్నారు.

9న జగన్ పుంగనూరు పర్యటన రద్దు : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పుంగనూరులో హత్యకు గురైన బాలిక అస్పియా అంజుమ్ కేసులో ప్రభుత్వం స్పందించడంతో ఈ నెల 9న మాజీ ముఖ్యమంత్రి జగన్ పుంగనూరు పర్యటనను రద్దు చేసుకున్నారని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. తిరుపతిలోని తన నివాసంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. బాలిక అస్పియా అంజూం మృతి అందరినీ కలచి వేసిందన్నారు. చిన్నారి కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈ నెల తొమ్మిదిన పుంగనూరుకు వస్తానని జగన్ ప్రకటించారని, దీంతో హడావిడిగా ముగ్గురు మంత్రులు పుంగనూరులో పర్యటించారని తెలిపారు. పోలీసులు ఈ హత్య కేసును ఛేదించారని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జగన్ పర్యటనను రద్దు చేసుకున్నారని తెలిపారు. ఇదే శ్రద్ధ కర్నూలు ఘటన జరిగినపుడు చూపించి ఉంటే, ఆ అమ్మాయి ఆచూకీ లభించేదన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అత్యాచారాలు, హత్యలు ఎక్కువయ్యాయన్నారు. 'రెడ్‌బుక్' రాజ్యంగా ప్రభుత్వమే దాడులకు ప్రేరేపిస్తోందన్నారు. ఇవన్నీ పక్కన పెట్టి ప్రజల సంక్షేమం చూడాలని హితవు పలికారు.

ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న పవన్ కల్యాణ్

వన్యప్రాణుల రక్షణ.. మనిషి బాధ్యత

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వన్యప్రాణులను రక్షించుకోవడం మనిషి బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. మనపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఇతర జీవ రాశులన్నింటినీ రక్షించుకుంటేనే మనిషి జీవితం స్వచ్ఛంగా సాగిపోతుందని అన్నారు. మంగళగిరిలోని అరణ్య భవన్‌లో జరిగిన 70వ వన్యప్రాణి వారోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. వన్యప్రాణులు, సముద్ర జీవులు, ఇతర జీవరాశి పూర్తి మనుగడలో ఉంటేనే మనిషికి స్వచ్ఛమైన గాలి, నీరు అందుతుందని తెలిపారు. ఇతర జీవుల మనుగడపై మన ఉనికి ఆధారపడి ఉందనే విషయం నిత్యం గుర్తుంచుకోవాలని సూచించారు. పర్యావరణ, వన్యప్రాణుల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. వన్యప్రాణుల రక్షణ అనేది జీవన విధానంలో భాగం కావాలని సూచించారు. సముద్ర జీవుల్ని రక్షించడానికి ప్రత్యేకంగా ఓ సంస్థ పనిచేయడం తనకు ఆనందం కలిగించిందన్నారు. కొన్ని అవసరాల రీత్యా సముద్ర జీవులను మనిషి వేటాడుతున్నారని, విశిష్టమైన జాతులను మెడిసన్ కోసం, ఇతర అవసరాల కోసమంటూ సేకరిస్తున్నారని తెలిపారు. సేకరించే మనిషే వాటి జాతిని పెంచేందుకు కూడా ఆలోచన చేయాలని అన్నారు. లేదంటే భవిష్యత్తు తరాలకు ఈ విశిష్టమైన, అరుదైన సంపదను ఇవ్వలేని పరిస్థితులు ఏర్పడతాయని చెప్పారు. భవిష్యత్తు తరాలకు బంగారం లాంటి పర్యావరణాన్ని అందించాలంటే చిన్నప్పటి నుంచే వారికి ప్రకృతి ప్రాధాన్యం, పర్యావరణ అవసరాలను తెలియజేయాలని అన్నారు. పర్యావరణాన్ని కాపాడాలంటే తమ వంతుగా రోజువారీ వాడుతున్న ప్లాస్టిక్‌ను క్రమంగా తగ్గించాలని, మొక్కల పెంపకం జీవన విధానంలో భాగం కావాలని చెప్పారు. పిల్లల నుంచి పెద్దల వరకు పర్యావరణ హితం కోసం ఆలోచించి ప్రతి పని చేయాలన్నారు. పర్యావరణాన్ని రక్షించడం రోజువారీ జీవన విధానంలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పవన్‌కల్యాణ్ ప్రారంభించడంతో పాటు సముద్ర జీవ సాక్ష్యం అనే ప్రత్యేక యాప్‌ను ప్రారంభించారు. ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యాన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికైన దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ పిసిసిఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్ చిరంజీవి చౌదరి, సీనియర్ అధికారులు ఎకె నాయక్, ఆర్‌పి ఖజురియా, శ్రీధర్, రేవతి, రాహుల్ పాండే, శాంతిప్రియ పాండే, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా రైల్వే కమిషనర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, రెడ్డి సుబ్రమణ్యం సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న తను ఆప్కాస్‌లో చేర్చాలని శాఖ 2024 మార్చిలో ఉత్తర్వులు ఇచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని డైలీవేజ్ వర్కర్లు తెలిపారు. ఐదు నెలల నుంచి జీతాలు అందక ఇబ్బంది పడుతున్నామని, వీటిని విడుదల చేసి న్యాయం చేయాలని కోరారు. ఇంటి స్థలాలు, పింఛన్లు, నిలిచిన ఇంక్రిమెంట్లు, ఫీజు రియింబర్స్‌మెంట్, భూముల రీ సర్వేలు, అగ్రిగోల్డ్ బాధితులు, ఆర్థిక సాయం, సిఎంఆర్ఎఫ్ సాయం వంటి సమస్యలపై పలువురు వినతిపత్రాలు అందించి న్యాయం చేయాలని కోరారు.

ఏర్పాట్లు ఎలా ఉన్నాయ్..

- శ్రీవారి భక్తుల నుంచి ఇఒ ఫీడ్ బ్యాక్

కల్పవృక్ష వాహనంపై శ్రీమలయప్ప స్వామివారు

యాత్రికుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్న టిటిడి ఇఒ శ్యామలరావు

ప్రజాశక్తి- తిరుమల

టిటిడి ఇఒ శ్యామలరావు యాత్రికుల నుంచి ఫీడ్ బ్యాక్ స్వీకరణ ప్రారంభించారు. సిఎం చంద్రబాబు బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవాన్కి వచ్చిన సందర్భంగా యాత్రికుల నుంచి ఫీడ్‌బ్యాక్ స్వీకరణ చేయాలని ఆదేశించారు. దీంతో టిటిడి ఇఒ స్వయంగా రంగంలోకి దిగారు. కల్పవక్ష వాహన సేవ సందర్భంగా గ్యాలరీలలో ఉన్న పలువురు సందర్శకులను ఏర్పాట్లు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఫీడ్ బ్యాక్ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తామని ఇఒ తెలిపారు.

శ్రీవారికి చెన్నై గొడుగులు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవ నాడు స్వామివారికి అలంకరించేందుకు సోమవారం చెన్నై నుంచి హిందూ ధర్మార్థ సమితి ట్రస్టీ ఆర్ఆర్.గోపాల్‌జి ఆధ్వర్యంలో తొమ్మిది గొడుగులను తిరుమలకు తీసుకొచ్చి టిటిడి అధికారులకు అందజేశారు. అంతకు మునుపు ఆదివారం రాత్రి తిరుచానూరు అమ్మవారి గుడికి రెండు గొడుగులను సమర్పించారు.

కల్పవృక్ష, సర్వభూపాల వాహనంపై శ్రీ మలయప్ప

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన సోమవారం ఉదయం శ్రీమలయప్ప స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి వేణుగోపాలస్వామి అలంకారంలో కల్పవృక్ష వాహనంపైన రాత్రి సర్వభూపాల వాహనం పైన యాత్రికులకు దర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, యాత్రిక బృందాలు భజనలు, కోలాటాలు, జీయ్యం గార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. యాత్రికులు అడు గడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవలో స్వామివారికి అలంకరించేందుకు తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుండి గోదాదేవి మాలలు సోమవారం తిరుమలకు చేరుకున్నాయి.

నేడు గరుడ సేవ..

శ్రీవారి బ్రహ్మోత్సవాలలో 5వ రోజు 8వ తేదీ రాత్రి గరుడ వాహనంలో స్వామివారు విహరిస్తారు. శ్రీవారి గరుడసేవకు వచ్చే యాత్రికుల కోసం టిటిడి విస్తృత ఏర్పాట్లు చేసింది. గరుడ వాహనంపై సాయంత్రం 6.30 నుంచి రాత్రి 11 గంటల వరకు శ్రీమలయప్ప స్వామి వారు విహరిస్తారు. దాదాపు రెండు లక్షల మంది యాత్రికులు గ్యాలరీల్లో వేచి ఉండేందుకు తగ్గట్లుగా ఏర్పాటు చేశారు. గరుడ సేవ దర్శనం కోసం ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్లలో వేచి ఉండే యాత్రికులను సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవిందనిలయం నార్త్ వెస్ట్ గేట్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా దర్శనం కల్పించనున్నారు. వారి సౌకర్యార్థం అన్ని పాయింట్ల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. తిరుమల ఘాట్ రోడ్లలో ద్విచక్రవాహనాల రాకపోకలను సోమవారం రాత్రి తొమ్మిది గంటల నుండి బుధవారం ఉదయం ఆరు గంటల వరకు టిటిడి రద్దు చేసింది. ఆర్‌టిసి బస్సుల్లో దాదాపు మూడ వేల రౌండ్ ట్రిప్పుల ద్వారా దాదాపు మూడు లక్షలమందిని తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

97 శాతం స్పామ్ కాల్స్ బ్లాక్

- ఎయిర్‌టెల్ కొత్త ఎఐ సిస్టమ్‌తో చెక్
- తెలుగు రాష్ట్రాల సిఇఒ వెల్లడి



హైదరాబాద్ : తమ వినియోగదారులను స్పామ్ కాల్స్, మెసేజ్‌ల నుంచి రక్షించడానికి కొత్తగా ఎఐ ఆధారిత స్పామ్ డిటెక్షన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేశామని భారతీ ఎయిర్‌టెల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) శివన్ భార్గవ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ వినియోగదారుల అన్ని పరికరాల్లో ఆటోమేటిక్ యాక్టివేషన్‌తో ఉచితంగా దీన్ని అందిస్తున్నామన్నారు. దీన్ని ప్రారంభించిన 10 రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 12.2 కోట్ల స్పామ్ కాల్స్, 23 లక్షల స్పామ్ ఎస్ఎంఎస్ మెసేజ్‌లను విజయవంతంగా గుర్తించి బ్లాక్ చేశామన్నారు. దీనికి ఎలాంటి యాప్ డౌన్‌లోడ్ అవసరం లేదన్నారు. ఉచితంగా ఆటోమెటిక్‌గా ఈ సేవలు అందుతాయన్నారు. స్మార్ట్‌ఫోన్లతో ఇటీవల మోసాలకు గురయ్యే ప్రమాదం విపరీతంగా పెరగడంతో ఈ క్లిష్టమైన సమస్యను చురుకుగా పరిష్కరించడానికి తాము ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. రెండు రాష్ట్రాల్లో తమకు 3 కోట్ల పైగా ఖాతాదారులున్నారని తెలిపారు.

హిమాచల్ ఆర్‌టిసికి మరిన్ని ఒలెక్ట్రా బస్సులు

- 327 వాహనాల టెండర్ సొంతం

హైదరాబాద్ : హిమాచల్ రోడ్డు రవాణా సంస్థ (హెచ్ఆర్‌టిసి)కి ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ మరిన్ని బస్సులను సరఫరా చేయనుంది. విద్యుత్ బస్సుల కొనుగోలుకు తాజాగా పిలిచిన టెండర్లలో ఒలెక్ట్రా తక్కువ ధర కోట్ చేసి ఎల్ 1 బిడ్డర్ గా నిలిచింది. హెచ్ఆర్‌టిసి 327 విద్యుత్ బస్సుల కొనుగోలుకు తాజాగా టెండర్లు పిలిచింది. ఇందులో తొమ్మిది మీటర్ల బస్సులు 297, 12 మీటర్ల బస్సులు 30 ఉన్నాయి. ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, స్విచ్ మొబిలిటీ టెండర్లలో పాల్గొన్నాయి. టెండర్ ప్రక్రియ అనంతరం నిర్వహించిన సాంకేతిక పరీక్షల్లో రెండు సంస్థలు అర్హత సాధించాయి. అయితే తక్కువ ధర కోట్ చేసి ఒలెక్ట్రా సంస్థ అంతిమంగా ఎల్1 గా నిలిచింది. హిమాచల్ రాష్ట్ర ప్రజల అవసరాల నిమిత్తం త్వరితగతిన బస్సులను కొనుగోలు చేయాలనే ఉద్దేశ్యంతో ఉన్న ఆర్‌టిసి త్వరలో ఆర్డర్ ఖరారు చేయనుంది. 2017లోనూ ఒలెక్ట్రా 25 బస్సులను అందించింది. వాటిని కులు మనాలి రోహ్తాంగ్ మధ్య ఆర్ టి సి నడుపుతోంది. హిమాచల్ కొండల్లో పర్యావరణాన్ని పరిరక్షించడంలో ఒలెక్ట్రా బస్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆ సంస్థ తెలిపింది.

ఫరెవర్ న్యూకు అంబాసిడర్‌గా త్రిప్తి డిమ్రీ

హైదరాబాద్ : మెల్‌బోర్న్‌కు చెందిన ప్రీమియం మహిళల ఫ్యాషన్ బ్రాండ్ ఫరెవర్ న్యూ కొత్తగా బాలీవుడ్ నటి త్రిప్తి డిమ్రీని తన గ్లోబల్ అంబాసిడర్‌గా నియమించుకుంది. దీంతో త్రిప్తి ఇప్పుడు భారత్ సహా ఆస్ట్రేలియా, కెనడా, దక్షిణాఫ్రికా, యూరప్‌తో సహా ప్రధాన మార్కెట్‌లలో ఫరెవర్ న్యూకు ప్రాతినిధ్యం వహించనుందని ఫరెవర్ సంస్థ తెలిపింది.

స్టాండప్ కమెడియన్ ట్వీట్‌కు ఓలా షేర్ల పతనం

ముంబయి : ఓలా ఎలక్ట్రిక్ సర్వీసు సెంటర్ల కొరతపై స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా చేసిన ట్వీట్ ఆ కంపెనీ షేర్లను భారీగా పడేసింది. ఓలా పేలవ సేవలు, సర్వీసింగ్ సెంటర్ల ముందు పెద్ద ఎత్తున పోగుబడిన వాహనాల ఫోటోను ఎక్స్ వేదికలో కునాల్ పంచుకున్నారు. ఈ అధ్వాన పరిస్థితుల్లో భారతీయులు ఇవిలను ఎలా ఉపయోగించుకోగలరని మంత్రి నితిన్ గడ్కరీకి ట్యాగ్ చేశారు. దీనిపై ఓలా సిఇఒ భవిష్ అగర్వాల్ తీవ్రంగా స్పందించారు.

ఇది కాస్తా ఇద్దరి మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. ఆ ప్రభావం కంపెనీ షేర్లపై గట్టిగా పడింది. సోమవారం బిఎస్ఇలో ఓలా షేర్ 9.4 శాతం పతనమై రూ.89.7కు పడిపోయింది. ఈ కంపెనీల్లో గరిష్ట స్థాయిలో షేర్లు కొనుగోలు చేసిన వారు భారీ నష్టాలను చవి చూస్తున్నారు. ఆగస్టులో పబ్లిక్ ఇష్యూకు వచ్చిన రోజుల్లో రూ.70 వద్ద లిస్టింగ్ కాగా.. అదే నెల 20న రూ.157కు చేరింది. ఈ ధర వద్ద కొనుగోలు చేసిన ఇన్వెస్టర్లు ప్రస్తుతం ఏకంగా 43 శాతం విలువ కోల్పోయినట్లయ్యింది.

HDFC BANK
We understand your world

నమోదిత కార్యాలయం : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోవర్ పారెల్ (పశ్చిమం), ముంబాయి-400 013 మరియు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, I-తింక్ టెక్నో క్యాంపస్, కంజూర్ మార్గ్ (తూర్పు), ముంబాయి-400 042 వద్ద ఉన్న రిటైల్ పోర్ట్ పోలీయో నిర్వహణగా దాని కార్యాలయం ఒకటి.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కి తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన విక్రయ సమాచారం మరియు పబ్లిక్ నోటీసు.

హెచ్‌డిఎఫ్‌సి ("బ్యాంకు") యొక్క దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు బ్యాంకుకు తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించి, రుణం / ఓవర్‌డ్రాఫ్ట్ స్వభావంలో క్రెడిట్ సౌకర్యాలను పొందడం కోసం దీని ద్వారా తెలియజేయబడుతుంది.

అంగీకరించిన లోన్ నిబంధనల ప్రకారం బకాయిలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతల నిరంతర డీఫాల్ట్ కారణంగా, దిగువ రుణ ఖాతాలు అపరాధ స్థితిలో ఉన్నాయని బ్యాంకు ఈ రుణగ్రహీతలకు అనేక నోటీసులు జారీ చేసింది, దిగువ పేర్కొన్న తేదీలో తుది విక్రయ నోటీసుతో సహా, బ్యాంక్ ప్లెడ్జ్‌ను చేయించిన మరియు దిగువ ఖాతాలలో మొత్తం బకాయిలను తిరిగి చెల్లించడానికి రుణగ్రహీతకు 7 రోజుల సమయం ఇచ్చింది. విఫలమైతే బ్యాంక్ ఈ విషయంలో తదుపరి నోటీసు జారీ చేయకుండా తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడానికి స్వేచ్ఛ ఉంటుంది. రుణగ్రహీతలు నిర్లక్ష్యానికి గురయ్యారు మరియు సరియైన చెల్లింపులు చేయడంలో విఫలమయ్యారు, కాబట్టి రుణ బప్పందం ప్రకారం బ్యాంకు తన హక్కులను వినియోగించుకోవడంలో ప్లెడ్జీగా రుణగ్రహీతల నుండి బ్యాంకుకు చెల్లించాల్సిన బకాయిలను రికవరీ చేయడానికి 15 అక్టోబరు, 2024న లేదా ఆ తర్వాత సెక్యూరిటీలను విక్రయించాలని/డిస్పోజ్ చేయాలని నిర్ణయించింది. రుణగ్రహీతలు మార్జిన్ అవసరంలో మరింత లోపాన్ని సృష్టించడానికి స్టాక్ మార్కెట్‌లో అస్థిరత కారణంగా ఎప్పుడైనా తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విలువ మరింత పడిపోతే, ఈ విషయంలో తదుపరి నోటీసు లేకుండా బ్యాంకు తన అభీష్టానుసారం తాకట్టు పెట్టిన సెక్యూరిటీని క్యాలెండర్ రోజు ఒకటి (1) లోపు విక్రయిస్తుంది. రుణగ్రహీతలు ఏదైనా మిగిలిన బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి, తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత బ్యాంకుకు బాధ్యత వహిస్తారు.

క్ర సం.	లోన్ అకౌంట్ నెం.	రుణగ్రహీతల పేరు	3 అక్టోబరు, 2024 నాటికి బకాయి మొత్తం	విక్రయ నోటీసు తేదీ
1	XXXX0031	అయాస్ కంత జెన	66,000.00	21-09-2024
2	XXXX6129	విచరపు రమేష్	15,762.47	30-09-2024
3	XXXX0411	మహబూబ్ ఉనిసా బేగం	10,15,264.75	30-09-2024
4	XXXX0970	సయ్యద్ అల్లాబక్షు	9,05,617.21	07-10-2024

తేది : 08.10.2024
ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

నూతన కల్లు పాలసీ ప్రకటించండి

- నీరా పరిశ్రమను వెంటనే ప్రారంభించాలి
- ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ విధానాల వల్ల సంక్షోభంలో ఉన్న కల్లుగీత కార్మిక కుటుంబాలను ఆదుకునేలా సమగ్ర నూతన కల్లు పాలసీని తక్షణమే ప్రకటించాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన మద్యం పాలసీ ప్రభుత్వ ఆదాయం కోసమా? లేక కార్పొరేట్ మద్యం కంపెనీల లాభాల కోసమా? లేక ప్రజాప్రతినిధులు ప్రయోజనాలు.. ప్రజా శ్రేయస్సు కోసమా? అనేది ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ బెల్ట్ షాపుల ద్వారా రాత్రీ, పగలు తేడా లేకుండా మద్యం విక్రయించి కల్లు అమ్మకాలను దెబ్బతీయొద్దని విజ్ఞప్తి చేశారు. బీరు, బ్రాందీ, విస్కీ, చీప్ లిక్కర్లను ప్రోత్సహిస్తూ ప్రకృతి సహజ సిద్ధమైన తాటి కల్లును ప్రభుత్వం శీతల పానీయంగా ఎందుకు ప్రోత్సహించడం లేదని ప్రశ్నించారు. టిడిపి కూటమి ప్రభుత్వానికి మద్యం ఆదాయమే ప్రధాన వనరుగా కావాలో, లేక ఓట్లు వేసి గెలిపించిన లక్షలాది గీత కార్మిక కుటుంబాలు కావాలో స్పష్టం చేయాలన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం అడగని వాగ్దానాలు చేసి గీత కార్మిక కుటుంబాల్లో ఆశలు రేకెత్తించి తాజాగా గందరగోళం సృష్టించడం సరైంది కాదన్నారు. మద్యం ఆదాయమే ప్రధాన వనరుగా చూడకుండా కేరళ ప్రభుత్వం మాదిరిగా పరిమితమైన మద్యం దుకాణాలను ప్రభుత్వమే నడుపుతూ గీత కార్మిక కుటుంబాలను అన్ని విధాలా ఆదుకునేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి గీత కార్మికుని కుటుంబానికీ మూడెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల భాగస్వామ్యంతో ఉన్న ఆర్థిక కార్పొరేషన్‌ను తక్షణం పునరుద్ధరించాలని, తాటిచెట్టుకు రూ.పది చొప్పున పన్ను కట్టించుకొని చెట్టుపై హక్కు కల్పించాలని, వృత్తిలో ప్రమాదాల నివారణకు సేఫ్టీ మోకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యార్థిని కుటుంబంపై ఉన్మాది దాడి

- అర్ధరాత్రి వేళ కత్తి, సుత్తితో వీరంగం

ప్రజాశక్తి - చెరుకుపల్లి, రేపల్లె (బాపట్ల జిల్లా)

పదోతరగతి విద్యార్థిని కుటుంబంపై కత్తి, సుత్తితో ఉన్మాది విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన ఆదివారం అర్ధరాత్రి బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం కనగాలలో జరిగింది. చెరుకుపల్లి ఎస్ఐ కథనం ప్రకారం.. కనగాల గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలీ పెద్ద కుమార్తె గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నారు. విద్యార్థిని పాఠశాలకు వచ్చి వెళ్లే సమయాల్లో చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామానికి చెందిన కుంచాల భార్గవ్‌రెడ్డి ప్రేమపేరుతో వేధింపులకు గురిచేసేవాడు. విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తెను చదువు మాన్పించారు. దీంతో భార్గవ్‌రెడ్డి తన స్నేహితుడు విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ఆదివారం అర్ధరాత్రి బాలిక ఇంటికి వెళ్లాడు. బాలిక తండ్రిపై కత్తి, సుత్తితో దాడి చేశాడు. అడ్డుకోబోయిన అతడి భార్య ఆరీఫా, కూతురిపై కూడా దాడి చేసి.. పరారయ్యాడు. తీవ్ర గాయాలపాలైన మస్తాన్‌వలీ, ఆరీఫా, బాలికను రేపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. షేక్ మస్తాన్‌వలీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముద్దాయిలను శిక్షించాలి : ఐద్వా

మస్తాన్‌వలీ కుటుంబాన్ని రేపల్లె ప్రభుత్వాస్పత్రిలో ఐద్వా, సిపిఎం నేతలు పరామర్శించారు. నిందితులను వెంటనే శిక్షించాలని ఆస్పత్రి వద్ద ఐద్వా, సిపిఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ముద్దాయిలను 24 గంటల్లో అరెస్టు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేసి శిక్షలు వేస్తేనే ఈ ప్రభుత్వం మీద మహిళలకు విశ్వాసం ఉంటుందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి అన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిఎస్‌పిని ఫోన్‌లో కోరారు. కార్యక్రమంలో సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆగ్రహం

తాము మూడేళ్ల క్రితం స్పష్టంగా ఆదేశించినా- దేశంలోని పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నవంబరు 19లోగా తగు చర్యలు తీసుకోవాలని, ఇదే తాము ఇస్తున్న చివరి అవకాశమని ఘాటుగా హెచ్చరించింది. దేశంలోని పేదల పట్ల, వలస కార్మికుల సంక్షేమం పట్ల దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ స్థాయిలో స్పందించటం అభినందనీయం. తనకు తానుగా అన్నార్తులకు అండగా నిలవకపోగా, సుప్రీం చెప్పిన తరువాత కూడా ఇన్నేళ్లూ పట్టించుకోని మోడీ ప్రభుత్వం తీరు ఆక్షేపణీయం.

"దేశంలో ఏ ఒక్కరూ పస్తులతో పడుకున్నా మన స్వాతంత్ర్యానికి సంపూర్ణత లేదన్నట్టే!" అన్నారు మహాత్మా గాంధీ. ఆ మాట ప్రకారం చూస్తే... ఆడంబరంగా అమృతోత్సవం జరుపుకొన్న 75 ఏళ్ల స్వరాజ్య పాలన తరువాత కూడా మనం ఇంకా సంపూర్ణత సాధించలేదు. దేశంలో రోజూ 19 కోట్ల మంది ప్రజలు ఖాళీ కడుపుతో పడుకుంటున్నారని జాతీయ ఆరోగ్య సర్వే నివేదించింది. అన్ని తరగతుల ప్రజలూ నిత్యావసరాల కోసం నానా ఇక్కట్లూ పడుతున్న పరిస్థితి రోజురోజుకీ పెరుగుతోంది. రెక్కాడితేనే కాని డొక్కాడని కోట్లాదిమంది శ్రామికుల జీవనం మరింత దుర్భరంగా మారింది. 2020 నాటి కోవిడ్ కాలం ఈ దుర్భర దృశ్యాన్ని దేశానికి కళ్లకు కట్టినట్టు చూపించింది. రోజువారీ పని ఒక్కసారిగా ఆగిపోతే- వలస కార్మికులు ఆ మరుసటి రోజుకే కడుపు నింపుకోవడం కనాకష్టమైన దుస్థితిని దృశ్యమానం చేసింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా తీసుకొని, దేశంలో ఏ ఒక్కరూ ఆకలితో ఉండరాదని, తక్షణమే అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు మంజూరు చేసి, బియ్యం వగైరా దినుసులు అందించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఇది జరిగి మూడేళ్లు పూర్తయినా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యం. పైగా తమ పాలనలో దేశం బ్రహ్మాండంగా వెలిగిపోతున్నట్టు, ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా పురోగమించి, అందరూ ధనికులైపోతున్నట్టు గొప్పలు వల్లించింది. అంతర్జాతీయ ఆకలి సూచిలో 125 దేశాల్లో భారత్ 111వ స్థానంలో ఉందని; పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక కన్నా పరిస్థితి అధమంగా ఉందని నివేదికలు వెల్లడిస్తే, అవన్నీ తప్పుడు లెక్కలని అధికార బిజెపి నాయకులు ఖండించటానికే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజల దైనందిన సమస్యలను గాలికొదిలేసి, ఉద్వేగ ఉద్రేక రాజకీయాలతో దేశాన్ని ఊగించటానికి ప్రధాని మోడీ సహా కాషాయ నేతలు తెగించారు.

వాస్తవాలతో సంబంధం లేని ఉద్వేగాలూ, ఉన్మాదాలూ ఏ సమస్యనూ పరిష్కరించలేవు. పైగా పరిస్థితిని జటిలం చేస్తాయి. మోడీ హయాంలో జరిగిందిదే! ప్రపంచంలో 82 కోట్ల మంది పోషకాహార లోపంతో బాధపడుతుంటే - అందులో 20 కోట్ల మంది మనదేశంలోనే ఉన్నారు. రోజూ పస్తులతో పడుకుంటున్న అన్నార్తుల్లో 24 శాతం మంది మనవాళ్లే! ఆకలి, పోషకాహార లేమి కారణంగా రోజూ 4500 మంది పిల్లలు చనిపోతున్నారు. ఇలాంటి దుస్థితి నుంచి గట్టెక్కించటానికి యుపిఎ - 1 ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ఆహార భద్రత చట్టం, ఉపాధి హామీ చట్టం వంటివి ఎంతోకొంత దోహదపడ్డాయి. 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, నిధులు తగ్గించి ఈ చట్టాలను నిర్వీర్యం చేశారు. అంబానీ - అదానీ వంటి కార్పొరేట్లను అత్యంత సంపన్నులుగా మార్చే పథకాలూ విధానాలు చేపట్టి, సాధారణ ప్రజల అభివృద్ధిని గాలికొదిలేశారు.

ఈ నయాఉదారవాద ఆర్థిక విధానాల వల్ల కార్మికులు, ఉద్యోగుల నిజవేతనాలు భారీగా తగ్గిపోగా, నిత్యావసరాల ధరలు ఆకాశానికి ఎగసాయి. ఎగుమతి- దిగుమతి విధానంలోనూ కార్పొరేటు అనుకూల నమూనానే పాటించటం వల్ల వంటనూనె తదితర నిత్యావసరాల ధరలు భారీగా పెరిగిపోయాయి. నువ్వులు, వేరుశనగ కాయలు, ఆయిల్ పామ్ గెలల ధరలు దారుణంగా తగ్గిపోయాయి. ఇటు రైతులకు నష్టం, అటు వినియోగదారులకు కష్టం కలిగించే కేంద్రం అంబాదానీ విధానం దేశానికి ప్రమాదకరం. సుప్రీంకోర్టు చీవాట్ల తరువాతనైనా కేంద్ర ప్రభుత్వం తన విధివిధానాలను, ప్రాధాన్యాలను ప్రజానుకూలంగా మార్చుకోవాలి. తక్షణమే వలస కార్మికులకు, పేద ప్రజలకు రేషన్ కార్డులు అందించి, కేరళ తరహాలో పూర్తిస్థాయి నిత్యావసర వస్తువులను ప్రజాపంపిణీ వ్యవస్థద్వారా అందజేయాలి.

మహనీయుల మాట

అర్థమయ్యే పరాయి భాషలో మాట్లాడితే మెదడుకు చేరుతుంది.
కానీ, మాతృభాషలో మాట్లాడితే మనసుకు చేరుతుంది.

- నెల్సన్ మండేలా,
దక్షిణాఫ్రికా పూర్వ అధ్యక్షుడు.

మాంద్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ



> **ఒకవేళ వడ్డీ రేట్లను బాగా తగ్గించి ప్రజలకు ఎక్కువ ధనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఏ ప్రభుత్వం అయినా అనుకుంటే అప్పుడు ఆ స్వల్ప వడ్డీ రేట్లు ఆకర్షణీయంగా లేవంటూ ఇక్కడి బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి వేరే చోటికి తరలించుకుపోతుంది. ప్రస్తుతం తన ఇష్టం వచ్చినట్టు వడ్డీ రేట్లను పెంచడం గాని, తగ్గించడం గాని చేయగలిగే శక్తి అమెరికాకు మాత్రమే ఉంది. అక్కడ గనుక డిమాండ్‌ను పెంచడం కోసం వడ్డీ రేట్లను తగ్గిస్తే అప్పుడు తక్కిన దేశాలలో కూడా వడ్డీరేట్లను తగ్గించడానికి వీలౌతుంది. ఐతే, ప్రస్తుతం అమెరికాలో వడ్డీ రేట్లు దాదాపు సున్నా శాతానికి చేరుకున్నాయి. అయినా ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం లేదు. దీర్ఘకాలంగా ఇలా వడ్డీరేట్లను అతి తక్కువగా కొనసాగించడంతో కార్పొరేట్లు తమ లాభాల మార్జిన్‌ను పెంచుకోడానికి సరుకుల ధరలను పెంచడం మొదలెట్టాయి. దానితో ద్రవ్యోల్బణం వేగం పుంజుకుంది.**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగం 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత తగ్గిందన్నది నిస్సందేహం. అమెరికాలోని కొందరు మితవాద ఆర్థికవేత్తలు సైతం 'ఇది దీర్ఘకాలిక మాంద్యం' అంటున్నారు (ఆ పదానికి వారిచ్చే నిర్వచనం వింతగా ఉంటుంది). ఈ అంశాన్ని కొన్ని గణాంకాల ద్వారా వివరించడం ఈ వ్యాసం ఉద్దేశం.

జిడిపి ని (స్థూల జాతీయోత్పత్తి) లెక్కించే విధానాలు ఆ యా దేశాల్లో చాలా వరకూ విశ్వసనీయత కలిగినవి కావు. ఇక మొత్తం ప్రపంచానికి సంబంధించి ప్రత్యేకంగా చెప్పనవసరమే లేదు. భారత దేశంలో అధికారిక లెక్కలను అనేకమంది పరిశోధకులు ప్రశ్నిస్తున్నారు. అధికారులేమో 7 శాతం, ఆ పైబడి వృద్ధిరేటు ఉన్నట్టు చూపుతున్నారు. కాని ఈ పరిశోధకులు అది 4 శాతం నుండి 4.5 శాతానికి మించదని, ఈ పరిస్థితి గత కొన్ని సంవత్సరాలుగా ఇదే మాదిరిగా ఉంటోందని గట్టిగా చెప్తున్నారు. ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ కొనసాగిన గత కాలంతో పోల్చి నయా ఉదారవాద విధానాల కాలంలో జిడిపి వృద్ధిరేటు గురించి చంకలు గుద్దుకోవడం అర్థం లేనిది. గత కాలంతో పోల్చితే వృద్ధిరేటు పెరిగింది పెద్దగా లేదు. పైగా అసమానతలు బాగా పెరిగిపోతున్నాయి. పోషకాహార లభ్యత గురించి లభిస్తున్న గణాంకాలను బట్టి శ్రామిక ప్రజానీకపు స్థితిగతులు బాగా క్షీణించాయని స్పష్టంగా చెప్పవచ్చు. అంత నిలకడ లేని ఈ జిడిపి గణాంకాలను పక్కనపెట్టి ప్రపంచ జిడిపి సంగతేమిటో చూద్దాం.



ప్రభాత్ పట్నాయక్

ఇందుకోసం నేను ప్రపంచబ్యాంక్ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటున్నాను. 2015 నాటి ధరలు ఆ యా దేశాల్లో ఎలా ఉన్నాయో, పరిశీలించి, వాటిని 2015 నాటి డాలర్‌తో ఆ యా దేశాల కరెన్సీ మారకపు రేటును లెక్కలోకి తీసుకుని ఆ ప్రాతిపదికన జిడిపి లెక్కలను అంచనా కట్టారు. 1961 నుంచీ గడిచిన కాలాన్ని కొన్ని ఉప కాలాలుగా విభజించి ఆ యా ఉప కాలాలలో వృద్ధి ఏ విధంగా ఉన్నదీ పరిశీలించడం కొంచెం చిక్కులతో కూడుకున్న విషయమే. ఒక దశాబ్ద కాలాన్ని ఒక ఉప కాలంగా విభజిస్తే గనుక దానిలో ఒక సమస్య వస్తుంది. ఆ దశాబ్దపు మొదటి ఏడాది గనుక వృద్ధి రేటు బాగా తక్కువగా ఉంటే, దాంతో పోల్చినప్పుడు తక్కిన దశాబ్దకాలం యావత్తూ వృద్ధిరేటు చాలా ఎక్కువగా జరిగినట్టు లెక్క వస్తుంది. అందుచేత సరైన అంచనాలకు రావడానికి వీలుగా నేను 1961 నుంచీ గడిచిన కాలంలో బాగా ఎక్కువ వృద్ధిరేటు సాధించిన సంవత్సరాలను ఎంచుకున్నాను. ఆ విధంగా చూసినప్పుడు 1961, 1973, 1984, 1997, 2007, 2018 సంవత్సరాలలో అత్యధిక వృద్ధిరేటు జరిగినట్టు తేలింది. ఇప్పుడు వీటిలో ప్రతీ రెండింటి మధ్య కాలంలోని వృద్ధిరేటును పరిశీలించాను. ఆ రేట్లు ఈ విధంగా (పట్టిక) ఉన్నాయి.

ఉపకాలం	సాలుకు జిడిపి వృద్ధి రేటు
1961–73	5.4 శాతం
1973–84	2.9 శాతం
1984–97	3.1 శాతం
1997–2007	3.5 శాతం
2007–2018	2.7 శాతం

పట్టికలోని అంకెలను బట్టి మూడు నిర్ధారణలు చేయవచ్చు. **మొదటిది:** మొత్తంమీద చూసినప్పుడు ప్రభుత్వాల నియంత్రణలో దేశాల ఆర్థిక వ్యవస్థలు నడిచినప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు నయా ఉదారవాద కాలంలోని వృద్ధిరేటు కన్నా చాలా ఎక్కువగా ఉంది. "మార్కెట్టే సర్వ శక్తి సంపన్నం" అంటూ ఇప్పుడు జరుగుతున్న చర్చల్లో నయా ఉదారవాద కాలంలోనే జిడిపి వృద్ధిరేటు బాగా ఎక్కువగా ఉందన్న అభిప్రాయం కలుగుతుంది. ఈ అభిప్రాయం పూర్తిగా తప్పు. వాస్తవానికి నయా ఉదారవాద కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు గణనీయంగా మందగించింది.

రెండవది: ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థలు నడిచిన కాలానికి, నయా ఉదారవాద విధానాలు అమలు కావడం మొదలైన నాటికి మధ్య కొంత వ్యవధి ఉంది. ఈ కాలంలో వృద్ధిరేటు 5.4 శాతం నుండి 2.9 శాతానికి పడిపోయింది. 1967 నుండి ద్రవ్యోల్బణం వేగవంతం అయి 1973–74 వరకూ కొనసాగింది. దానిని అదుపు చేయడానికి పెట్టుబడిదారీ వర్గం ప్రభుత్వ వ్యయాన్ని కుదిస్తూ, భారీ స్థాయిలో నిరుద్యోగాన్ని పెంచే వ్యూహాన్ని అనుసరించింది. ఈ వ్యూహం ఫలితంగా 1973 నుంచీ వృద్ధిరేటు మందగించింది. అప్పటి నుంచీ దేశాల ఆర్థిక వ్యవస్థల మీద ప్రభుత్వాల నియంత్రణ ఉండే విధానం నిలిచిపోయింది. ఇలా వృద్ధిరేటు మందగించిపోవడం నయా ఉదారవాద విధానాలను ప్రవేశపెట్టడానికి కావలసిన భూమికను కల్పించింది. అప్పటికే పెరుగుతూ అంతకంతకూ అంతర్జాతీయ స్వభావాన్ని సంతరించుకుంటున్న ద్రవ్య పెట్టుబడి అంతకు ముందునుంచే నయా ఉదారవాద విధానాలకు మళ్ళాల్సిందేనంటూ ఒత్తిడి పెంచుతోంది. సరిగ్గా ఆ సమయానికే పాత విధానాల పర్యవసానంగా ముందు ద్రవ్యోల్బణం, తర్వాత వృద్ధిరేటు మందగించడం జరిగాయి.

మూడవది: పైన ఇచ్చిన అంకెలను చూస్తే అమెరికాలో హౌసింగ్ బుడగ పేలిపోయిన అనంతర కాలంలో వృద్ధిరేటు మందగమనం కొనసాగుతూనే వుంది. హౌసింగ్ బుడగ బద్దలైపోవడంతో పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తంగా సంక్షోభంలో పడింది. అప్పుడు ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున జోక్యం చేసుకుంది (ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వాల జోక్యం ఉండరాదనే నయా ఉదారవాదం బండారం దీనితో బైటపడింది). కాని వాస్తవ ఆర్థిక వ్యవస్థకు దాని నుంచి ఎటువంటి ప్రేరణా లభించలేదు. వృద్ధిరేటును పెంచడానికి ప్రభుత్వాల వ్యయం పెరగడం గాని, హౌసింగ్ బుడగ వంటి మరేవైనా బుడగలు ఏర్పడి తాత్కాలికంగా వృద్ధిరేటు వేగాన్ని పెంచడానికి దోహదం చేయడం వంటివి కాని జరగలేదు.

మనం 2018 సంవత్సరాన్ని ఆఖరి గరిష్ట వృద్ధి సంవత్సరంగా తీసుకున్నాం. ఆ తర్వాత చూస్తే వృద్ధిరేటు మరీ అన్యాయంగా పడిపోయింది. 2018 నుంచి 2022 మధ్య వృద్ధిరేటు సాలుకు 2.1 శాతం మాత్రమే ఉంది. ప్రపంచ జనాభా వృద్ధిరేటు సుమారు 1 శాతంగా ఉంది (మన దేశ జనాభా లెక్కలు 2021లో సేకరించి వుండాల్సింది. కాని ఇంతవరకూ ఆ పని ప్రారంభం కానేలేదు.). దీనిని పరిగణనలోకి తీసుకుంటే ప్రపంచ తలసరి ఆదాయం ఒక శాతం చొప్పున మాత్రమే పెరుగుతున్నట్టు భావించాలి. ఐతే, ప్రపంచంలో ఆదాయాల మధ్య అసమానతలు బాగా పెరుగుతున్నాయి. దానిని బట్టి ప్రపంచ జనాభాలో అత్యధిక మెజారిటీ ఆదాయాలలో పెరుగుదల లేకుండా స్తంభించిపోవడం కాని తరిగిపోవడం కాని జరుగుతోంది. దీనిని వివరించడానికి దిగువ విషయాన్ని ఉదహరిస్తాను. ప్రపంచ ఆదాయం మొత్తంలో సగభాగం కన్నా ఎక్కువ జనాభాలోని అత్యంత సంపన్నులైన 10 శాతం ప్రజలు పొందుతున్నారు. వీరి ఆదాయాలు ఏటా కనీసం 2 శాతం చొప్పున పెరుగుతున్నాయనుకుంటే అప్పుడు తక్కిన 90 శాతం మంది ఆదాయాలూ ఏ పెరుగుదలా లేకుండా స్తంభించిపోయినట్టే కదా. అంటే నయా ఉదారవాదం చివరి దశలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ జనాభాలో అత్యధిక ప్రజానీకపు ఆదాయాలు పెరుగుదల లేకుండా స్తంభించిపోయేట్టు చేసిందని స్పష్టం అవుతోంది. ఇది పాత వలస పాలనా కాలాన్ని గుర్తుకు తెస్తోంది. అప్పుడు కూడా ప్రపంచంలోని అత్యధిక శాతం ప్రజల నిజ ఆదాయాలు పెరగకపోగా తరిగిపోయాయి.

ఇలా వృద్ధిరేటు మందగించడం అనేది కొద్ది కాలంపాటు మాత్రమే ఉండే తాత్కాలిక సమస్య అని, త్వరలోనే దీనిని అధిగమిస్తామని అనుకోలేం. ఈ పరిస్థితి నయా ఉదారవాద విధానాల పర్యవసానమే. ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటు పెరగాలంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరగాలి. అంటే ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలంటే ప్రభుత్వం అందుకు వీలుగా వ్యయాన్ని పెంచాలి. ఆ పెరిగే వ్యయాన్ని ద్రవ్యలోటును పెంచడం ద్వారానో లేక సంపన్నుల మీద పన్నులను అదనంగా విధించడం ద్వారానో భరించాలి. కాని ఈ రెండిట్లో దేనినీ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అంగీకరించదు. ప్రభుత్వం ఆ యా దేశాలకు విడివిడిగా ఉంటుంది. కాని ద్రవ్య పెట్టుబడి అంతర్జాతీయ స్వభావాన్ని కలిగివుంది. అందుచేత ఏ దేశంలోనైనా తన ఆదేశాలకు భిన్నంగా జరిగితే వెంటనే ద్రవ్య పెట్టుబడి క్షణాల్లో ఆ దేశాన్ని వదిలిపెట్టి పోతుంది. అలా వెళ్ళిపోకుండా నిలుపు చేయాలంటే ఆ యా దేశాల ప్రభుత్వాలు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అడుగులకు మడుగులొత్తక తప్పదు. అందుచేత ప్రభుత్వ జోక్యం ద్వారా మార్కెట్‌లో డిమాండ్‌ను, ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం అనేది ఈ నయా ఉదారవాద చట్రం లోపల జరగని పని.

ఇక ఆ యా దేశాల ప్రభుత్వాలు జోక్యం చేసుకోగలిగేది ఒక్క ద్రవ్య విధానం ద్వారా మాత్రమే. ఇక్కడ కూడా ఒక దేశం తన వడ్డీ రేట్లను సంపన్న దేశాలలో అమలౌతున్న వడ్డీ రేట్లకన్నా మరీ తక్కువగా నిర్ణయించకూడదు. ముఖ్యంగా అమెరికా లోని వడ్డీ రేట్లతో పోల్చుకున్నప్పుడు తేడా ఎక్కువ ఉండకూడదు. ఒకవేళ వడ్డీ రేట్లను బాగా తగ్గించి ప్రజలకు ఎక్కువ ధనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఏ ప్రభుత్వం అయినా అనుకుంటే అప్పుడు ఆ స్వల్ప వడ్డీ రేట్లు ఆకర్షణీయంగా లేవంటూ ఇక్కడి బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి వేరే చోటికి తరలించుకు పోతుంది. ప్రస్తుతం తన ఇష్టం వచ్చినట్టు వడ్డీ రేట్లను పెంచడం గాని, తగ్గించడం గాని చేయగలిగే శక్తి అమెరికాకు మాత్రమే ఉంది. అక్కడ గనుక డిమాండ్‌ను పెంచడం కోసం వడ్డీ రేట్లను తగ్గిస్తే అప్పుడు తక్కిన దేశాలలో కూడా వడ్డీరేట్లను తగ్గించడానికి వీలౌతుంది. ఐతే, ప్రస్తుతం అమెరికాలో వడ్డీ రేట్లు దాదాపు సున్నా శాతానికి చేరుకున్నాయి. అయినా ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం లేదు. దీర్ఘకాలంగా ఇలా వడ్డీరేట్లను అతి తక్కువగా కొనసాగించడంతో కార్పొరేట్లు తమ లాభాల మార్జిన్‌ను పెంచుకోడానికి సరుకుల ధరలను పెంచడం మొదలెట్టాయి. దానితో ద్రవ్యోల్బణం వేగం పుంజుకుంది.

పాపం! కీన్స్! సోషలిస్టు విప్లవం రాకుండా పెట్టుబడిదారీ వ్యవస్థే దీర్ఘ కాలం కొనసాగాలని కలలు గన్నాడు. అందుకోసం ప్రభుత్వ జోక్యాన్ని ఒక పరిష్కారంగా సూచించాడు. కాని ఇప్పుడది సాధ్యమయ్యేది కాదని తేలిపోయింది. కీన్స్ కల పీడకలగా మిగిలిపోయింది. ప్రస్తుత నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ పరిస్థితి ఈ విషయాన్ని స్పష్టంగా చూపుతోంది.

(స్వేచ్ఛానుసరణ)

తల్లి పాలలో విశిష్ట అణువులు - సరికొత్త వైద్యాలు



ఎస్. కృష్ణస్వామి

> **తల్లి పాలలో 50 వేలకు మించి చిన్న చిన్న అణువులు వున్నాయని ఈ మధ్య గుర్తించారు. వాటిలో చాలా వాటి గురించి పెద్దగా తెలియదు. కానీ కృత్రిమ మేధను ఉపయోగించి ఈ వేలాది అణువులకు, వాటి వల్ల తల్లికి, బిడ్డకు ఒనగూడే ఆరోగ్య లాభాలకూ మధ్య ఉండే సంబంధాలను శాస్త్రవేత్తలు ఇటీవలే తెలుసుకున్నారు. గుండె జబ్బుల్లో, కీళ్ల జబ్బుల్లో, కణాల వాపుకు సంబంధించిన వైద్యాలలో వీటి పాత్ర గురించి ఇప్పుడిప్పుడే పరిశోధనలు జరుగుతున్నాయి. ఉదాహరణకు కాలిఫోర్నియా యూనివర్సిటీలో జరిగిన పరిశోధనలో... గుండె జబ్బులకు కారణమయ్యే రక్తనాళాల్లో ఏర్పడే అడ్డంకులను, హెచ్‌ఎంవోలు నిరోధించగలరని తేలింది.**

తల్లి పాలపై ఇటీవల చాలా పరిశోధనలు జరుగుతున్నాయి. పసిబిడ్డలకు పౌష్టికాహార విలువలు ఇవ్వడంలో, వ్యాధి నిరోధకతను పెంపొందించడంలో, శిశువు ఎదుగుదలలో, సాధారణ ఆరోగ్య పరిరక్షణలో తల్లిపాలది ముఖ్యమైన పాత్ర. బిడ్డకు మంచి ఆహారంగా మాత్రమే కాకుండా, వైద్యంలో కూడా ఉపయోగపడగలిగే, కొన్ని విశిష్ట అణువులను, తల్లిపాలలో ఈ మధ్యనే గుర్తించారు.

సంక్లిష్ట అణువులు - కొత్త పరిశోధనలు

తల్లి పాలలో సంక్లిష్టమైన అణువులు అనేకం ఉన్నాయి. క్షీరదాల పరిణామ క్రమంలో తల్లి పాలలో ఒక సంక్లిష్టమైన అణువుల దొంతర రూపొందింది. అందులో హ్యూమన్ మిల్క్ ఆలీగో శాకరైడ్స్ (హెచ్.ఎం.ఓ) అనేది ఒకటి. పొట్టి గొలుసుల రసాయన రూపంలో ఉండే చక్కెర పదార్థాలు ఇవి. వీటికి ఒక విశిష్ట లక్షణం ఉంది. వ్యాధి నిరోధక శక్తిని కల్పించడం ద్వారా, అవి శిశువులను ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా రక్షిస్తాయి. హెచ్.ఎమ్.ఓ లే కాకుండా, శిశువు ఎదుగుదలకు తోడ్పడే ప్రోటీన్లు, హార్మోన్లు, విటమిన్లు, ఇంకా కొన్ని సజీవ కణాలు కూడా తల్లిపాలలో ఉంటాయి. తల్లిపాలలో ఇటువంటి విశిష్ట అణువులు, 250 దాకా ఉన్నట్టు 2009లో కనుగొన్నారు. 2015 వచ్చేసరికి 300 దాక మైక్రో ఆర్.ఎన్.ఏ లను కనుగొన్నారు. జన్యు వ్యక్తీకరణలలో, నియంత్రణలలో వీటి పాత్ర ఉంటుంది. వివిధ రకాలుగా ఉండే ఈ మైక్రో ఆర్.ఎన్.ఏ లు వివిధ జీవన చర్యలలో పాత్ర తీసుకుంటూ ఉంటాయి. రోగనిరోధక వ్యవస్థలు, జీవ కణాల అభివృద్ధి, మెటబాలిజంలో ముఖ్య పాత్ర వహిస్తాయి. శిశువు ఎదుగుదలలో ఈ ఎం.ఆర్.ఎన్.ఏ లు కీలక పాత్ర వహిస్తాయి. ఉదాహరణకు ఎమ్.ఐ.ఆర్-148ఎ-3పి మరియు ఎమ్.ఐ.ఆర్-125బి-5పి అనే మైక్రో ఆర్.ఎన్.ఏ లు తల్లిపాలలో ఉన్నాయి. శిశువు పెరుగుదలలో మరీ ముఖ్యంగా జీర్ణాశయ వ్యవస్థల అభివృద్ధిలో ఇవి పని చేస్తాయి. అలాగే జన్యు క్రమాల వారసత్వ లక్షణాల మార్పులలో, రోగనిరోధక వ్యవస్థల స్పందనల నియంత్రణలో కూడా ఇవి పని చేస్తూ ఉంటాయి.

ఇటీవల కాలంలో కొన్ని విషయాలు గమనించారు. తల్లిపాలలో సజీవ కణాలు కూడా ఉంటున్నాయి. ఒక మిల్లీలీటర్ తల్లిపాలలో వేల, లక్షల సంఖ్యలో ఇవి కనిపిస్తున్నాయి. ఈ కణాలలో స్టెమ్ సెల్స్ లాంటివి కూడా ఉన్నాయి. ఇవి ఒక విధమైన మౌలిక కణాలు. ఇతర కణాల కంటే భిన్నమైనవి. స్టెమ్ కణాలు బిడ్డకే కాదు తల్లికి కూడా లాభదాయకం. అంతేకాదు. వీటి ఆవిష్కరణ వల్ల పునరుత్పాదక వైద్యశాస్త్రం కూడా పెద్ద ఎత్తున లాభపడుతున్నది. ఎప్పటికప్పుడు తన్ను తాను తాజా పరుచుకుంటూ, రకరకాల భిన్న కణాలుగా విభజన చెందగల శక్తి ఉన్న స్టెమ్ కణాలు, తల్లిపాలలో ఉన్నాయని, కనుక్కోవడమే ఒక మైలురాయి.

నూతన ఆవిష్కరణల వైపుగా...

తల్లి పాలలో 50 వేలకు మించి చిన్న చిన్న అణువులు వున్నాయని ఈ మధ్య గుర్తించారు. వాటిలో చాలా వాటి గురించి పెద్దగా తెలియదు. కానీ కృత్రిమ మేధను ఉపయోగించి ఈ వేలాది అణువులకు, వాటి వల్ల తల్లికి, బిడ్డకు ఒనగూడే ఆరోగ్య లాభాలకూ మధ్య ఉండే సంబంధాలను శాస్త్రవేత్తలు ఇటీవలే తెలుసుకున్నారు. గుండె జబ్బుల్లో, కీళ్ల జబ్బుల్లో, కణాల వాపుకు సంబంధించిన వైద్యాలలో వీటి పాత్ర గురించి ఇప్పుడిప్పుడే పరిశోధనలు జరుగుతున్నాయి. ఉదాహరణకు కాలిఫోర్నియా యూనివర్సిటీలో జరిగిన పరిశోధనలో...గుండె జబ్బులకు కారణమయ్యే రక్తనాళాల్లో ఏర్పడే అడ్డంకులను, హెచ్‌ఎంవోలు నిరోధించగలరని తేలింది.

తల్లిపాలలో ఉన్న స్టెమ్ సెల్స్, పునరుత్పాదక వైద్య శాస్త్రంలో కొత్త తలుపులు తెరుస్తున్నాయి. వీటి లక్షణాలు, మానవ పిండం నుంచి వచ్చే స్టెమ్ సెల్స్ లక్షణాలు సరిపోలుతున్నాయి. ఈ కణాలు పార్కింగ్‌సన్ అల్జీమర్స్ లాంటి వృద్ధాప్య జబ్బుల వైద్యాలలో ఉపయోగపడే అవకాశాలున్నాయి. కొన్ని రకాల స్టెమ్ సెల్స్ లాగా ఇవి క్యాన్సరు కారకాలు కావు. స్వీడన్‌లో ఉన్న 'లుండ్' యూనివర్సిటీలో పరిశోధకులు మరో విషయం కనుక్కున్నారు. తల్లిపాలలో ఉన్న కొన్ని అణువులు (లాక్ట్ ఆల్బుమిన్, వోలియాక్ యాసిడ్‌ల కలయికతో ఏర్పడే, హామ్లెట్ (హెచ్.ఎ.ఎమ్.ఎల్.ఇ.టి) అనే ఒక సంక్లిష్ట అణువు) లంగ్ క్యాన్సర్‌ను కలగజేసే కణాలను నిర్మూలించే గుణం కలిగి ఉన్నాయని తెలుసుకున్నారు. మూత్రాశయ ట్యూమర్ ఉన్న 88 శాతం మందిలో, క్యాన్సర్ తగ్గేలా ఈ కణాలు పని చేశాయని రుజువైంది. తల్లిపాల కణాలతో, అనేక రకాల క్యాన్సర్ల వైద్య పరిశోధనలకు ఇవన్నీ ఊతమిస్తున్నాయి. తల్లిపాలలో ఉండే కొన్ని రకాల మైక్రో ఆర్.ఎన్.ఏ (ఎమ్.ఐ.ఆర్-375-3 పి)లో బ్రెస్ట్ క్యాన్సర్‌ను తగ్గించే గుణం ఉందని కనుక్కున్నారు. వీటికి ఉన్న కణ మరణాలను నియంత్రించే గుణం కూడా క్యాన్సర్ వైద్యంలో తోడ్పడుతుందని భావిస్తున్నారు. ఎముకల క్యాన్సర్ నుండి కోలుకోవడంలో, మూలుగ మార్పిడి వైద్యంలో కూడా తల్లిపాల కణాలు ఉపయోగపడతాయి. సందర్భ వశాత్తు, ఇటువంటి వైద్యం చేయించుకునే చిన్నపిల్లల్లో వచ్చే ఇన్ఫెక్షన్లను కూడా ఇవి తగ్గిస్తాయి. అని తొలి పరిశోధనలు చెబుతున్నాయి. శిశు పేగుల్లో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా (బైఫిడో బ్యాక్టీరియం) అభివృద్ధి చెందడంలో కూడా తల్లి పాలు ముఖ్య పాత్ర వహిస్తాయి. చిన్నపిల్లలలో కొన్ని రకాల ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్ లాంటి జబ్బుల్లో కూడా తల్లి పాల కణాల వైద్యం ఉపయోగపడుతుంది కాబట్టి, పెద్దవాళ్లలో కూడా ఈ ఉపయోగాలు ఉండవచ్చన్న దిశగా పరిశోధనలు జరుగుతున్నాయి.

నెలలు నిండకుండా పుట్టిన బిడ్డలలో, నాడీ కణజాల పరిరక్షణలో తల్లి పాల పాత్ర గురించి శాస్త్రవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. అటువంటి బిడ్డల్లో దెబ్బ తిన్న మెదడుకు, నాసిక గుండా తల్లి పాల వైద్యం ద్వారా, ఆపరేషన్ల అవసరాన్ని కొంతవరకు తగ్గిస్తున్నారు. ఇటువంటి వైద్యమే, నెలలు నిండకుండా పుట్టిన శిశువులలో మెదడులో జరిగిన రక్త స్రావాన్ని తగ్గిస్తున్నది. తల్లి పాలలో ఉన్న స్టెమ్ కణాలలో నాడీ కణజాలాలను పరిరక్షించే, గుణం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. తల్లి పాలలో న్యూరో ట్రాఫిక్ ఫ్యాక్టర్లు (బి.డి.ఎన్.ఎఫ్, జి.డి.ఎన్.ఎఫ్) ఉంటాయి. శిశువుల పేగుల లోని నాడీ కణ వ్యవస్థ అభివృద్ధిలో వీటి పాత్ర ఉంది. అలాగే పెద్దవాళ్ళలో వచ్చే కొన్ని నాడీ కణాల జబ్బులలో కూడా ఇవి ఉపయోగపడవచ్చు.

సవాళ్లు - భవిష్యత్తు

అయితే తల్లిపాలలో ఉన్న ఈ విశిష్ట లక్షణాలను తమ డబ్బా పాల ఫార్ములా లోకి తేవాలని, పరిశ్రమలు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాయి. కానీ వాళ్ళు ఎంత కష్టపడినా తల్లిపాలకు సరి సమానమైనదేదీ ఇప్పట్లో తయారు చేయలేరు. అయితే కంపెనీలు సాంకేతిక అభివృద్ధి సాయంతో, తల్లిపాలలో ఉండే జీవాణువులను, జీవచైతన్య కారకాలను తమ ఫార్ములాలలోకి ఇమిడ్చి, శిశు పేగు ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నారు. బయో ఇంజనీరింగ్ పద్ధతుల ద్వారా తల్లిపాలలో ఉన్నట్టే ప్రోటీన్లను, కొవ్వులను తయారు చేయాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. రెండు స్టార్టప్ కంపెనీలు (హేలైనా, బయో మిల్క్) ఈ పనిలో ఉన్నాయి. అవి ఇంకా తొలి ప్రయత్నాల దశలోనే ఉన్నాయి. తల్లిపాలలో ఉన్న ఎం.ఆర్.ఎన్.ఎ కృత్రిమ తయారీ ప్రయత్నాలు సఫలీకృతం కావడం లేదు. తల్లిపాల జీవ చర్యలలో ఉన్న సంక్లిష్టతను కృత్రిమంగా సాధించడం ఇప్పటికిప్పుడు అయ్యేట్టు లేదు. అయితే తల్లిపాల మీద జరుగుతున్న పరిశోధనలు కొత్త సంభావ్యతలకు దారితీస్తున్నాయి. క్యాన్సరు, గుండె జబ్బులు, నాడీ జబ్బులు తదితర ప్రధాన ఆరోగ్య సమస్యల పరిష్కారంలో...ఈ పరిశోధనలు సరికొత్త ఆయుధాలు అవుతున్నాయి. అయితే ఇప్పుడు మన ముందు ఒక కొత్త సవాలు ఉంది. అదేమిటంటే, ఈ తల్లిపాల విజ్ఞాన శాస్త్రం వల్ల వచ్చే ఫలితాలు (నైతిక దృష్టితో, సమ న్యాయ దృష్టితో చూసినప్పుడు) సమాజంలో అందరికీ చెందాలి. తల్లిపాల మానవీయతకు ఎటువంటి మచ్చ రాకుండానే ఇది జరగాలి. తల్లి పాలలో ఉన్న విశిష్ట అణువులకు, శిశు వైద్యాన్నే కాదు. సాధారణ వైద్య శాస్త్రాన్ని కూడా మార్చివేసే శక్తి ఉంది. ఆధునిక వైద్య శాస్త్రానికి ఇదొక కొత్త వనరు అవుతుంది. అయితే ఈ మానవ క్షీర విజ్ఞాన శాస్త్రం ఇంకా తొలి దశలో ఉంది. తల్లి పాల వాణిజ్యీకరణ ఎన్నో నైతిక ప్రశ్నలకు దారితీస్తున్నది. శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు, ప్రైవేటు కంపెనీలు...అందరూ తల్లి పాల ద్వారా జరిగే వైద్య ప్రక్రియలకు సంబంధించిన స్పష్టమైన నైతిక నియమావళిని రూపొందించాల్సి వుంది. పటిష్ట నియంత్రణ అవసరం అవుతున్నది. ప్రజల ఆరోగ్యం, ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేయాల్సిన సందర్భమిది. అంతేగాని పెద్ద మందుల కంపెనీలు, వ్యాపార సంస్థల లాభాలకు కాదు.

(స్వేచ్ఛానువాదం)

★

దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోంది

- కేంద్రంపై తేజస్వి ధ్వజం
- 'ల్యాండ్ ఫర్ జాబ్' కేసులో బెయిల్

న్యూఢిల్లీ : 'ఉద్యోగం కోసం భూమి' కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారులు తేజస్వి యాదవ్, తేజ్ ప్రతాప్ యాదవ్‌లకు ఢిల్లీ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో నిందితులందరికీ లక్ష రూపాయల వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేస్తూ ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నీ ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేశారు. బెయిల్ పొందిన అనంతరం తేజస్వి విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. రాజకీయ కుట్రతోనే తమపై కేసు పెట్టారని చెప్పారు. న్యాయస్థానంపై తమకు నమ్మకం ఉన్నదని లాలూ ప్రసాద్ అన్నారు. ఈ కేసులో తమకు న్యాయం జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో వెస్ట్ సెంట్రల్ రైల్వే జోన్‌లో గ్రూప్-డి ఉద్యోగాలు ఇవ్వడం కోసం లాలూ ప్రసాద్ తన మంత్రి పదవిని దుర్వినియోగం చేసి ముడుపులు దండుకున్నారని సిబిఐ, ఇడిలు కేసు నమోదు చేశాయి. ఉద్యోగాలు ఇచ్చినందుకు బహుమతిగా లాలూ కుటుంబ సభ్యులు అభ్యర్థుల నుండి భూమిని తీసుకున్నారని ఆరోపించాయి.

రైలు పట్టాలను అమ్మేయొద్దు

- మోడీ ప్రభుత్వానికి లాలూ సూచన



పాట్నా : ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైల్వే వ్యవస్థను నాశనం చేస్తోందని రైల్వే శాఖ మాజీ మంత్రి, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ విమర్శించారు. రాబోయే రోజులలో ఈ ప్రభుత్వం రైలు పట్టాలను సైతం విక్రయిస్తుందేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. 'మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రైలు ఛార్జీలను, ప్లాట్‌ఫారం టిక్కెట్ల రేటును పెంచేసింది. రైలు స్టేషన్లను అమ్మేసింది. జనరల్ బోగీల సంఖ్యను తగ్గించింది. వృద్ధులకు అందజేస్తున్న ప్రయోజనాలను నిలిపివేసింది' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే భద్రతను గాలికి వదిలేయడంతో ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని లాలూ విమర్శించారు. ఇప్పుడేమో రైల్వేలు నష్టాలలో ఉన్నాయని చెబుతున్నారని అంటూ వాటిని పూడ్చుకునేందుకు రైలు పట్టాలను అమ్మొద్దని ప్రభుత్వాన్ని కోరారు. హర్యానా శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని చెబుతూ దీనిని నరేంద్ర మోడీ ఓటమిగానే చూడాలని లాలూ అభిప్రాయపడ్డారు. లాలూ ప్రసాద్ యుపిఎ ప్రభుత్వ హయాంలో రైల్వే మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. దివాలా తీసే పరిస్థితికి చేరుకున్న రైల్వేలను ఆయన గాడిలో పెట్టారు. లాలూ నేతృత్వంలో రైల్వేలు సాధించిన అభివృద్ధిపై ప్రపంచంలోని అనేక యూనివర్సిటీలలో అధ్యయనాలు జరిగాయి. 2004లో లాలూ రైల్వే మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు రైల్వేలు కేవలం రూ.880 కోట్ల మిగులులో మాత్రమే ఉన్నాయి. 2007 నాటికి రైల్వే శాఖ లాభాలు రూ.11,500 కోట్లకు చేరాయి. సామర్థ్యాన్ని మెరుగుపరచేందుకు, ప్రయాణికుల సంఖ్యను, సరుకు రవాణాను పెంచేందుకు లాలూ తీసుకున్న చర్యల కారణంగా ఆ శాఖ మంచి లాభాలు ఆర్జించింది. నికర ఆదాయం కూడా రూ.4,000 కోట్ల నుండి రూ.16,000 కోట్లకు పెరిగింది.

స్కంద మాత అలంకారంలో భ్రమరాంబదేవి

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో దసరా మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఐదో రోజు భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారు శేష వాహనంపై, భ్రమ రాంబ దేవి అమ్మవారు స్కందమాత గా ఊరేగించారు. ముందుగా స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో శేష వాహనంపై అధిష్ఠింపజేశారు. అర్చకులు, పండితులు ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఉత్సవం నిర్వహించి ఉత్సవమూర్తులను గ్రామోత్స వానికి తరలించారు. వేడుకలో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం కార్య నిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం భ్రమరాంబాదేవిని కాత్యాయని అలంకారంలో, స్వామి అమ్మవార్లు హంస వాహనంపై ఊరేగించనున్నారు.

నాసిరకం విత్తనాలతో నిండా మునిగాం

- పత్తి మొక్కలతో రైతు నిరసన

ప్రజాశక్తి - ఆదోని (కర్నూలు)

రిజిస్టర్డ్ ఆఫీసు: రాధిక, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్, నవరంగపుర, అహ్మదాబాద్-380009.
బ్రాంచ్ ఆఫీస్: 76-8-10/1, ప్లాట్ నెం.4, భవాని టవర్స్, ...
(అనుబంధం-4) స్వాధీనతా ప్రకటన
...
తేది: 03-10-2024 / ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

भारतीय दंत परिषद
(दंत चिकित्सक अधिनियम, 1948 के तहत स्थापित एक सांविधिक निकाय)
स्वास्थ्य और परिवार कल्याण मंत्रालय, भारत सरकार के अधीन
డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వంలోని ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ క్రింద
(దంత వైద్యుల చట్టం, 1948 ప్రకారం ఏర్పాటు చేయబడిన ఒక చట్టబద్ధమైన సంస్థ)
सत्यमेव जयते

బహిరంగ ప్రకటన
దంత వైద్య కళాశాలలు/సంస్థల్లో ర్యాగింగ్ ముప్పును అరికట్టడం

ర్యాగింగ్ అనేది క్రిమినల్ నేరమని ప్రజల దృష్టికి తీసుకురాబడింది మరియు డెంటల్ కాలేజీలలో ర్యాగింగ్ ముప్పును అరికట్టడానికి దంత వైద్యంలో ర్యాగింగ్ శాపాన్ని నిషేధించడం మరియు నిరోధించడం మరియు తొలగించడం కొరకు 2009 కళాశాలలు/ సంస్థలు డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 'డిసిఐ నిబంధనలను రూపొందించింది.

పైన పేర్కొన్న నిబంధనలు తప్పనిసరి మరియు అన్నీ డెంటల్ కాలేజీలు/సంస్థలు డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు తెలియజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాయి.

ర్యాగింగ్ సంబంధిత సంఘటనల కారణంగా బాధలో ఉన్న విద్యార్థులు యుజిసిని టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1800-180-5522 లేదా 011-40108512, 011-40194297 లోని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో యాక్సిస్ చేయవచ్చు.

సెక్రెటరీ ఇన్చార్జ్
డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా
CBC- 17110/11/0001/2425

ఇజ్రాయిల్ మారణహోమం నిలిపివేయాలి

- మోడీ వైఖరి దేశ ప్రతిష్టకు భంగకరం
- పాలస్తీనా సంఘీభావ కార్యక్రమంలో ప్రకాశ్ కరత్
- దేశవ్యాప్తంగా పాలస్తీనా సంఘీభావ దినం విజయవంతం

పాలస్తీనా సంఘీభావ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రకాశ్ కరత్, హాజరైన ప్రజానీకం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పశ్చిమాసియాలో ఇజ్రాయిల్ దురాక్రమణ, పాలస్తీనా, లెబనాన్‌లలో వేలాది మంది పౌరుల హత్యకు వ్యతిరేకంగా సోమవారం దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద వేలాది మంది విద్యార్థులు, కార్మికులు, ఉపాధ్యాయులు, మహిళలు, యువకులు, వామపక్ష అభిమానులు గుమికూడి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా గుమికూడిన ప్రజానీకాన్ని ఉద్దేశించి సిపిఎం సమన్వయ కర్త ప్రకాశ్ కరత్ మాట్లాడుతూ, గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోత తమకు ఎంతమాత్రం ఆమోద యోగ్యం కాదని అన్నారు. తక్షణం కాల్పుల విరమణ ప్రకటించాలని, ఇజ్రాయిల్‌కు ఇండియా ఆయుధాలు, డ్రోన్‌ల ఎగుమతులను నిలిపివేయాలని నిరసనకారులు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. పాలస్తీనా, లెబనాన్‌లకు వారు పూర్తి సంఘీభావాన్ని తెలిపారు.

పాలస్తీనాకు మద్దతుగా ఇండియా జోక్యం చేసుకోవాలని వారు కోరారు. ఇండియన్స్ ఫర్ పాలస్తీనియన్స్, ఇండో- పాలస్తీనా సాలిడారిటీ నెట్‌వర్క్, ఇండో- పాలస్తీనీ సాలిడారిటీ ఫోరం వంటి పౌర సమాజ గ్రూపుల సమన్వయంతో దేశ వ్యాపితంగా నిరసనలు తెలిపారు.నిరసనకారులు వివిధ యూనియన్ల ఎర్ర జెండాలు, పాలస్తీనా జెండాలు, ప్లకార్డులు చేత బట్టుకుని ఇజ్రాయిల్ డౌన్ డౌన్ అంటూ బిగ్గరగా నినదించారు. జంతర్ మంతర్ వద్ద ఏర్పాటైన పాలస్తీనా సంఘీభావ కార్యక్రమంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, ఆ పార్టీ సమన్వయకర్త ప్రకాశ్ కరత్ మాట్లాడుతూ..పాలస్తీనాపై ఇండియా అనాదిగా అనుసరిస్తూ వస్తున్న మిత్ర వైఖరిని మోడీ సర్కార్ పలుచన చేస్తోందని విమర్శించారు. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం అమెరికా మార్గాన్ని అనుసరిస్తోందని దుయ్యబట్టారు. 'గత సంవత్సర కాలంగా గాజాలో 42 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇది అధికారిక లెక్క, వాస్తవానికి ఈ మృతుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని కరత్ అన్నారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలు, చిన్న పిల్లలు ఉన్నారు. ఇది ఎలాంటి యుద్ధమో ఈ వివరాలే రుజువు చేస్తున్నాయి. ఇది మొత్తం సమాజాన్ని అంతం చేయడానికి ఉద్దేశించిన మారణ హోమం' అని పేర్కొన్నారు. అమెరికా వారికి ఆయుధాలు, డబ్బు ఇచ్చి పాలస్తీనాకు వ్యతిరేకంగా ఎగదోస్తోందని విమర్శించారు. పాలస్తీనాకు భారతదేశం దీర్ఘకాలంగా ఇస్తున్న మద్దతును పలుచన చేస్తూ మోడీ ప్రభుత్వం, ఇజ్రాయిల్‌కు అండగా నిలుస్తోందని దుయ్యబట్టారు. మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తోంది. ఆయుధాలు, డ్రోన్‌లను ఎగుమతి చేస్తున్నారు అని అన్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తున్నదని, మోడీ ప్రభుత్వం కూడా అదే బాటలో నడవడం సిగ్గుచేటని అన్నారు.

ప్రత్యేక పాలస్తీనా రాష్ట్రానికి భారత్ చిరకాలంగా తెలుపుతూ వస్తున్న మద్దతుకు మోడీ ప్రభుత్వం తిలోదకాలిచ్చి, అమెరికాకు తోకగా వ్యవహరిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ దురాక్రమణను ఖండించే తీర్మానం ఐరాస జనరల్ అసెంబ్లీ ఇటీవల ఆమోదించినప్పుడు, ఇండియా ఓటింగ్‌కు దూరంగా ఉందని ఆయన గుర్తు చేశారు. 'నాటోలోని యుఎస్ మిత్రదేశాలు స్పెయిన్, బెల్జియం, యుకె ఇజ్రాయిల్‌కు ఆయుధాలు ఎగుమతి చేయకూడదని నిర్ణయించుకున్న సమయంలో, అలీన ఉద్యమానికి నాయకుడిగా ఉన్న, గ్లోబల్ సౌత్‌కు నాయకుడిగా చెప్పుకునే ఇండియాను మోడీ ప్రభుత్వం, అమెరికా సామ్రాజ్యవాదం, ఇజ్రాయిల్ యుద్ధ నేరాలకు భాగస్వామిగా మార్చింది' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కాబట్టి ఆందోళన పాలస్తీనాకు సంఘీభావం గురించి మాత్రమే కాదు. మనం పాలస్తీనా ప్రజలకు మరింత మద్దతును కూడగట్టాలి. అదే సమయంలో, పాలస్తీనా ప్రజలకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని బహిర్గతం చేయాలి. ఆయుధాల ఎగుమతిని ఆపడానికి చర్యలు తీసుకోవాలి. గాజాలో కాల్పుల విరమణను నిర్ధారించడానికి అన్ని ఫోరమ్‌లలో పని చేయాలి' అని అన్నారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, సిపిఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య కూడా కేంద్ర ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వడాన్ని విమర్శించారు. గాజాలో వెంటనే కాల్పుల విరమణ చేయాలని డిమాండ్ చేశారు.

నేడు ఎన్నికల ఫలితాలు

శ్రీనగర్ : హర్యానా, జమ్మూకాశ్మీర్ శాసనసభలకు జరిగిన ఎన్నికలకు సంబంధించి మంగళవారం ఫలితాలు వెలువడనున్నాయి. హర్యానాలో కాంగ్రెస్ విజయఢంకా మోగిస్తుందని అన్ని ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేశాయి. అయితే జమ్మూకాశ్మీర్‌లో హంగ్ ఏర్పడవచ్చునని అంచనా వేశాయి. జమ్మూకాశ్మీర్ ఎన్నికలలో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) ఉమ్మడిగా పోటీ చేశాయి. 83 స్థానాలలో ఉమ్మడి అభ్యర్థులను నిలిపాయి. ఐదు చోట్ల స్నేహపూర్వక పోటీకి దిగాయి. కాశ్మీర్ ప్రాంతంలో సిపిఐ (ఎం) నేత మహమ్మద్ యూసఫ్ తరిగామికి, జమ్మూ డివిజన్‌లో నేషనల్ పాంథర్స్ పార్టీకి మద్దతు ప్రకటించాయి. ఈ కూటమికే మెజారిటీ స్థానాలు లభిస్తాయని ఎగ్జిట్ పోల్స్ చెప్పాయి.

ఒకవేళ హంగ్ ఏర్పడిన పక్షంలో పిడిపి ఎలాంటి పాత్ర పోషిస్తుందనే దానిపై రకరకాల ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయి. 2014 ఎన్నికలలో పిడిపి 28 సీట్లు గెలుచుకొని అతి పెద్ద పార్టీగా అవతరించింది. బిజెపితో పొత్తు పెట్టుకొని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే 2018 జూన్‌లో బీజేపీ తన మద్దతు ఉపసంహరించుకుంది. దీంతో జమ్మూకాశ్మీర్ కేంద్ర పాలన కిందికి వచ్చింది. 2019లో పిడిపి నిట్టనిలువునా చీలిపోయింది. ఆ పార్టీ నుండి బయటికి వచ్చిన బుఖారీ 2020లో వేరు కుంపటి పెట్టారు. అయితే ఆ పార్టీకి ఇంకా ప్రజలలో పట్టు లభించలేదు. బుఖారీ పార్టీ తాజా ఎన్నికలలో మనుగడ కోసం పోరాడింది.

ఇంజినీర్ రషీద్ నేతృత్వంలోని అవామీ ఇతెహాద్ పార్టీ (ఎఐపి) బారాముల్లా ప్రాంతంలో కొంత ప్రభావం చూపవచ్చని భావిస్తున్నారు. బారాముల్లా లోక్‌సభ స్థానం పరిధిలో 18 శాసనసభ సీట్లు ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికలలో వీటిలో 15 చోట్ల ఎఐపికి మెజారిటీ ఉంది. అయితే ఆయన బిజెపికి బినామీ అంటూ ప్రచారం జరగడంతో ఎఐపి విజయావకాశాలపై ప్రభావం పడవచ్చు. చిన్నా చితకా పార్టీలు, స్వతంత్రులు ఏ మేరకు ప్రభావం చూపుతాయో చూడాల్సి ఉంది.

మదురైలో కదంతొక్కిన పేదలు

- ఇళ్లు, భూములకు పట్టాలివ్వాలని వేలాదిమంది ప్రదర్శన

మధురై : వేలాదిమంది పేదలు మదురైలో కదంతొక్కారు. ఇళ్లకు, భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ వేలాదిమంది పేదలు సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. పార్లమెంట్ సభ్యులు, సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎస్.వెంకటేశన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.కన్నన్, మధురై పట్టణ, గ్రామీణ జిల్లాల కార్యదర్శులు ఎం.గణేశన్, కె.రాజేంద్రన్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.విజయరాజన్, ఎస్‌కె పొన్నుతాయ్ తదితరులు నాయకత్వం వహించారు. ప్రదర్శన అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు మెమొరాండం సమర్పించారు.

నేడు తెరుచుకోనున్న చైనా మార్కెట్లు

- అందరి చూపు అక్కడే

ముంబయి : వారం తర్వాత చైనా స్టాక్ మార్కెట్లు తెరుచుకుంటున్నాయి. చైనా నేషనల్ డే ఉత్సవాల సందర్భంగా అక్టోబర్ 1 నుంచి 7వ తేది వరకు అక్కడి ప్రభుత్వం గోల్డెన్ వీక్ హాలిడేను ప్రకటించింది. దీంతో గడిచిన వారం రోజులుగా చైనా మార్కెట్లు పని చేయలేదు. మంగళవారం తిరిగి మార్కెట్లు ప్రారంభం కానున్నాయి. ఇజ్రాయిల్- ఇరాన్ పరిణామాల మధ్య ప్రపంచంలోని ఇన్వెస్టర్ల చూపు చైనా మార్కెట్లపై పడింది. ఇటీవల చైనా ప్రభుత్వం ఆ దేశ వృద్ధికి కీలక విధానాలను ప్రకటించింది. దీంతో విదేశీ సంస్థాగత మదుపర్లు ఇతర దేశాల నుంచి చైనాకు పెట్టుబడులను భారీగా తరలిస్తున్నాయి. నేటి మార్కెట్లు ఎలా ఉండొచ్చోనని ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

హీరో మోటార్స్ ఐపిఒ ప్రతిపాదన ఉపసంహరణ

హీరో గ్రూపునకు చెందిన విడిభాగాల తయారీ సంస్థ హీరో మోటార్స్ తన ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) ప్రతిపాదనలను ఉపసంహరించుకుంది. ఈ ఇష్యూ ద్వారా రూ.900 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఐపిఒను ఉపసంహరించుకోవడానికి గల కారణాలను మాత్రం వెల్లడించలేదు.

కరాచి విమానాశ్రయం వెలుపల పేలుడు

- ఇద్దరు చైనీయులు మృతి, 8మందికి గాయాలు

కరాచి : కరాచి విమానాశ్రయం వెలుపల ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తీవ్రమైన పేలుడు సంభవించింది. ఈ పేలుడులో ఇద్దరు చైనా జాతీయులు మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. విమానాశ్రయానికి వెలుపల నిలిపిన ట్యాంకర్ పేలిందని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలంలో దట్టమైన పొగ కార్లను కమ్మేసింది. వెంటనే భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. చమురు ట్యాంకర్ పేలినట్లు కనిపిస్తోందని, ఈ పేలుడుకు కారణాలేంటి, ఎలా జరిగిందనే అంశంపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. గాయపడినవారిలో పోలీసులు కూడా వున్నారు. విదేశీయులను లక్ష్యంగా చేసుకునే ఈ దాడి జరిగిందని ప్రావిన్షియల్ హోం మంత్రి జియా ఉల్ హసన్ మీడియాకు తెలిపారు.

నక్సల్స్ ప్రభావం తగ్గింది

కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో నక్సల్స్ ప్రభావం తగ్గిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. సోమవారం నాడిక్కడ విజ్ఞాన్ భవన్‌లో అమిత్ షా అధ్యక్షతన నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల హోంమంత్రుల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, తెలంగాణ ముఖ్యమంత్రి, హోంమంత్రి ఎ రేవంత్‌రెడ్డితోపాటు కేంద్ర మంత్రులు జెపి నడ్డా, నిత్యానంద్ రాయ్, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హోంమంత్రులు, డిజిపిలు, కేంద్ర బలగాల చీఫ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నక్సలిజం అతిపెద్ద అడ్డంకి మాత్రమే కాదు, మానవాళికి శత్రువని అన్నారు. నక్సలిజాన్ని శాశ్వతంగా తొలగించడానికి చర్యలు చేపట్టాలన్నారు. నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు అభివృద్ధి, నక్సల్స్ వ్యతిరేక కార్యకలాపాల పురోగతిని కనీసం నెలకు ఒకసారి సమీక్షించాలని కోరారు. 2026 ఏప్రిల్ నాటికి ప్రజల సమిష్టి బలంతో రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం కలిసికట్టుగా పనిచేయడంతో నక్సలిజం ముప్పును పూర్తిగా నిర్మూలించామని ప్రకటించగలమని అన్నారు. 2004-2014తో పోల్చితే, దేశంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు 53 శాతం తగ్గాయని, 7,700 ఘటనలు నమోద య్యాయని అన్నారు. 96 జిల్లాల నుంచి 42కు తగ్గాయని, హింసాత్మక ఘటనలు నమోదయ్యే పోలీసు స్టేషన్ల సంఖ్య 465 నుండి 171కు తగ్గాయని తెలిపారు.

రూ.25.69 కోట్లు రీయంబర్స్‌మెంట్ చేయాలని కోరాం : అనిత

ప్రత్యేక పోలీస్ అధికారుల గౌరవ వేతనానికి సంబంధించి రూ.25.69 కోట్లు రీయంబర్స్‌మెంట్ చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్లు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. రాష్ట్రంలో నక్సల్స్ నిర్మూలనకు 800 మంది ప్రత్యేక పోలీస్ అధికారులను కేటాయించాలని కోరినట్లు చెప్పారు. 2023 జూన్‌లో ఇతరేతర విధుల నిర్వహణ కోసం ఐదు కంపెనీల సిఆర్‌పిఎఫ్ బలగాలను రాష్ట్రం నుండి బదిలీ చేశారని, వాటి పునరాగమనంపై చర్చించామని పేర్కొన్నారు. మొబైల్ టవర్ ప్రాజెక్టు ఫేజ్-2లో భాగంగా కేంద్రం 346 మొబైల్ టవర్లను కేటాయించగా, 211 టవర్లకు సంబంధించి పనులు జరుగుతున్నాయని, మిగతా 53 టవర్లకు సంబంధించిన పనులు త్వరగా ప్రారంభించాల్సిన అవసరముందని తెలియజేశానన్నారు. రాష్ట్రంలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 1,455.23 కిలోమీటర్ల మేర రోడ్లు, వంతెనల నిర్మాణ సంబంధిత ప్రతిపాదలను కేంద్ర ప్రభుత్వానికి ఇటీవలే సమర్పించామని, వీటిపై తదుపరి ఉత్తర్వులను ఆశిస్తున్నామని తెలిపారు. కొత్తవలస మండలం రెల్లి వద్ద గ్రేహౌండ్స్ తరహా కేంద్రం ఏర్పాటుకు 526 ఎకరాల భూమిని గుర్తించామని, ప్రాజెక్టు అనుమతుల గురించి చర్చించామని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగం అరికట్టేందుకు 'యాంటీ-నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్' ఏర్పాటు చేస్తోందని తెలిపారు. సామర్థ్య నిర్మాణం, ఇతర రాష్ట్రాలతో సంయుక్త టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు సంబంధించి సహాయ సహకారాలందించాలని కేంద్ర హోంమంత్రిని కోరామన్నారు.

ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతే లక్ష్యం !

- ప్రధాని మోడీతో మాల్దీవుల అధ్యక్షుడు ముయిజు భేటీ



న్యూఢిల్లీ : భారత్, మాల్దీవుల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యంగా మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజు న్యూఢిల్లీలో పర్యటించారు. మాల్దీవుల్లో భారత్ సహకారంతో చేపట్టిన కొత్త రన్‌వే ప్రారంభోత్సవం, అధికారికంగా రూపే కార్డును ప్రారంభించడం వంటి చర్యలు ఇరు దేశాల మధ్య ఆర్థిక, పర్యాటక సహకారాన్ని పెంచుకోవడానికి ఉద్దేశించబడ్డాయి. ప్రధాని నరేంద్ర మోడీ, ముయిజు ఇరువురూ కలిసి సంయుక్తంగా హనిమధూ అంతర్జాతీయ విమానాశ్రయంలోని రన్‌వేను ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. మాల్దీవుల్లో రూపే చెల్లింపుల సేవలను కూడా ఆరంభించారు. అంతకుముందు ఇరువురు నేతలు విస్తృతంగా చర్చలు జరిపారు. ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించు కున్నారు. భవిష్యత్ సహకారానికి కొత్త పంథాను రూపొందించామన్నారు. ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన జారీ చేశారు. ఈ సందర్భంగా ముయిజు భారత పర్యాటకులకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. భారత పర్యాటకులు తమకెంతో విలువైన వారని, వారు తమ ఆర్థిక వ్యవస్థపై సానుకూలమైన ప్రభావాన్ని చూపుతారని పేర్కొన్నారు. ముయిజు దేశాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్‌లో పర్యటించడం ఇదే ప్రథమం.

'అభయ' కేసులో సిబిఐ చార్జిషీట్

కోల్‌కతా : కోల్‌కతా ట్రైనీ వైద్యురాలు (అభయ) హత్య కేసులో సిబిఐ చార్జిషీట్ నమోదు చేసింది. సోమవారం మధ్యాహ్నం సీల్డ్ కవర్‌లో చార్జ్‌షీట్‌ను ప్రత్యేకోర్టుకు సమర్పించింది. నిందితుడు సంజయ్ రాయ్ వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేసినట్లు చార్జ్‌షీటులో పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వైద్యురాలు సెమినార్ హాల్‌లో నిద్రిస్తున్న సమయంలో నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పేర్కొన్నాయి. సంజయ్ రాయ్ ప్రధాన నిందితుడని 200 మంది ఇచ్చిన వాంగ్మూలాలను నమోదు చేసినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ఇంకా అనుమానితులు ఉన్నారా, సామూహిక అత్యాచారం కేసా? అన్న అంశంపై ఇంకా దర్యాప్తు జరుగుతోందని పేర్కొన్నాయి. ఆగస్టు 9న ఆర్‌జి కర్ ఆసుపత్రి మెడికల్ కళాశాలలో అత్యవసర విభాగంలో నైట్ డ్యూటీ చేసిన 31 ఏళ్ల జూనియర్ వైద్యురాలు విశ్రాంతి తీసుకోవడానికి వచ్చినప్పుడు ఈ దారుణ ఘటన జరిగింది. ఆమెపై అత్యాచారం చేయడంతోపాటు గొంతుకోసి, ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. తల, ముఖం, ప్రైవేటు భాగాలతోసహా 14 చోట్ల గాయాలున్నట్లు పోస్టుమార్టం నివేదిక పేర్కొంది. ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్ టిఎంసి కార్యకర్త కావడంతో తొలుత పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.

'ఉక్కు' ఊసు లేదా...!

(మొదటి పేజీ తరువాయి)

కార్మికులు తీవ్ర స్థాయిలో ఆగ్రహంగా ఉన్నారు. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా ఉధృత పోరాటాలకు వారు సిద్ధమౌతున్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నుండి కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాలని, ఈ మేరకు ప్రధాని మోడీ చేత ప్రకటన చేయించాలని వారు పట్టుబడుతున్నారు. కొద్దిరోజులుగా ఈ విషయం రాష్ట్రంలో చర్చనీయాంశం కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని దృష్టికి ఈ విషయం తీసుకుని వెళ్లే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. అయితే, భేటీ తరువాత బాబు చేసిన ప్రకటనలో ఆ ఊసే లేదు. ప్రధాని కార్యాలయంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇతర సంస్థలు కూడా సిఎం భేటీ తరువాత విశాఖ ఉక్కుపై ఎటువంటి వివరణ ఇవ్వలేదు. రాష్ట్రానికి చెందిన మరో కీలకాంశం ప్రత్యేకహోదాపై టిడిపి వైఖరి తెలిసిందే. మరోవైపు మంగళవారం ముఖ్యమంత్రి పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు పరిశ్రమపై మాట్లాడే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్నప్పటికీ, బాబు కలిసే మంత్రుల జాబితాలో ఉక్కుశాఖ మంత్రి లేకపోవడం గమనార్హం. బుడమేరు వరదలపై నివేదిక ఇచ్చిన తరువాత తొలిసారి ప్రధాని మోడీతో జరిపిన ఈ భేటీలో సిఎం చంద్రబాబు వరదలకు నష్టపోయిన రాష్ట్రానికి మరిన్ని నిధులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అలాగే పోలవరం ప్రాజెక్ట్ పనులు తిరిగి ప్రారంభించాలని, మరో సీజన్ నష్టపోకుండా నవంబర్‌లో వరద తగ్గుముఖం పట్టగానే కొత్త డయాఫ్రంవాల్ నిర్మాణ పనులు ప్రారంభించి వేసవి కల్లా పూర్తిచేసేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు వెంట కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు ఉన్నారు.

రైల్వేశాఖ మంత్రితో

అనంతరం కే ంద్ర రైల్వే, ఐటీ, సమాచార శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సిఎం చంద్రబాబు భేటీ అయ్యారు.ఈ భేటీ ముఖ్యమంత్రి అధికారిక నివాసం 1 జన్‌పథ్‌లో జరిగింది. అనంతరం 'డిసెంబరులో వైజాగ్ రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేస్తారని ఆశాభావం ఉంది. ఆంధ్రప్రదేశ్ అంతటా వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో రైల్వే రూ. 73,743 కోట్ల పెట్టుబడి పెడుతుందని రైల్వే మంత్రి తెలియజేశారు. ఈ ప్రాజెక్టులలో ఆంధ్రప్రదేశ్‌లో హౌరా-చెన్నై మధ్య నాలుగు లైనింగ్, 73 స్టేషన్లను ఆధునీకరించడం, మరిన్ని లోకల్ రైళ్లను ప్రవేశపెట్టడం ఉన్నాయి' అని బాబు ఎక్స్‌లో పేర్కొన్నారు. అనంతరం టిడిపి ఎంపిలతో కలిసి సిఎం చంద్రబాబు 1 జన్‌పథ్‌లో డిన్నర్ చేశారు.

నేడు కేంద్ర మంత్రులతో భేటీ

నేడు (మంగళవారం) సిఎం చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, పియూష్ గోయల్, హర్దీప్ సింగ్ పూరీలతో భేటీ కానున్నారు. తొలుత ఉదయం 1130 గంటలకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీతోనూ, సాయంత్రం 430 గంటలకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్‌తోనూ, సాయంత్రం 530 గంటలకు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీతోనూ, రాత్రి 8 గంటలకు కేంద్ర హెూం మంత్రి అమిత్ షాతోనూ, రాత్రి 1115 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ భేటీ కానున్నారు.

త్వరలో నూతన కౌల్దారుల చట్టం

(మొదటి పేజీ తరువాయి)

దక్కలేదని వివరించారు. ఈ నేపథ్యంలో భూ యజమానులకు నష్టం లేకుండా, కౌలు రైతులను అన్ని రకాలుగా ఆదుకునేలా నూతన చట్టాన్ని రాబోయే కెబినెట్‌లోనే ఆమోదించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే తయారైన ముసాయిదాపై రైతులు, రైతు సంఘాల అభిప్రాయాలు, సూచనలు పరిగణలోకి తీసుకుంటామని వెల్లడించారు. వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బి రాజశేఖర్ మాట్లాడుతూ నూతన చట్టంలో ప్రధానంగా వాస్తవ సాగుదారుల వివరాలు రికార్డుల్లో ప్రతిబింబించట్లేదన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో కౌల్దారుల సంఖ్య అధికంగా ఉందని తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా రెవెన్యూశాఖను పూర్తిగా తొలగిస్తామని, కార్డుల జారీ ప్రక్రియ మొత్తం వ్యవసాయ శాఖ చూస్తుందని తెలిపారు. ఈ ప్రక్రియలో ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తామన్నారు. భూ యజమానుల హక్కులకు ఎలాంటి భంగము కలగకుండా, అదే సందర్భంగా కౌలు రైతులకు కార్డులు, రుణాలు దక్కేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ భూయజమానులకు ఈ చట్టం పట్ల అవగాహన కల్పించి వారిలో భయాందోళనలు తొలగించాలని సూచించారు. ప్రభుత్వ భూములైన ఎండోమెంట్, వక్ఫ్ భూములనూ ఈ చట్టం పరిధిలోకి తెచ్చి, వాటిని సాగు చేస్తున్న కౌలు రైతులకు న్యాయం చేయాలని, డ్వాక్రా మాదిరిగా రైతు రుణాల రికవరీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, వి.కృష్ణయ్య మాట్లాడుతూ రైతులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలను అన్నింటిని కౌలు రైతులకూ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. వివిధ సంఘాల నాయకులు కొల్లి రంగారెడ్డి, రైతులు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్‌కుమార్, గళ్లా మాధవి, జెడ్‌పి చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆగని నరమేధం!

శిథిలాల కుప్పగా మారిన గాజా

- గాజాలో ఆటవిక దాడులకు ఏడాది

గాజా, బీరుట్ : గాజాలో ఇజ్రాయిల్ సాగించిన నరమేధానికి సోమవారంతో ఏడాది పూర్తయింది. అయినా రక్త పిపాసి నెతన్యాహు దాహం తీరలేదు. . గాజా నుండి లెబనాన్‌కు, ఇరాన్‌కు యుద్ధాన్ని విస్తరిస్తున్నాడు. గాజా, బీరుట్ సహా పలు ప్రాంతాల్లో పెను విధ్వంసం సృష్టించాడు. గతేడాది అక్టోబరు 7న ఇజ్రాయిల్‌లోని సంగీతోత్సవ కార్యక్రమంపై హమాస్ దాడి జరిపిందన్న సాకుతో ఇజ్రాయిల్, గాజాపై పెద్దయెత్తున దురాక్రమణపూరిత దాడికి దిగింది. వైమానిక, భూతల దాడులతో పాఠశాలలను, ఆస్పత్రులను, ఐరాస సహాయ శిబిరాలను సైతం బాంబులతో ధ్వంసం చేసింది. విచక్షణారహితంగా జరిగిన ఈ దాడుల్లో ఇప్పటికి 41,870మంది మరణించారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గాజాలోని 21లక్షల మందిలో 90శాతం మంది నిర్వాసితులయ్యారని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. లెబనాన్‌లో ఇజ్రాయిల్ భూతల దాడుల్లో దాదాపు రెండు వేలమంది లెబనాన్ జాతీయులు మరణించారు. 19వేలమంది నిర్వాసితుయ్యారని అధికార గణాంకాలు తెలిపాయి. ఈ సందర్భంగా పాలస్తీనాకు సంఘీభావం తెలుపుతూ కొవ్వొత్తుల ప్రదర్శనలు, సంస్మరణ సభలు, ప్రదర్శనలు ఇలా పలు కార్యక్రమాలు జరిగాయి. టెల్ అవీవ్ నుండి లండన్, పారిస్, బెర్లిన్ ఇలా ప్రపంచవ్యాప్తంగా పలు నగరాల్లో ప్రజలు పాలస్తీనియన్లకు తమ మద్దతు ప్రకటించారు. సెంట్రల్ టెల్‌అవీవ్‌పైకి రాకెట్లను ప్రయోగించినట్లు హమాస్ ప్రకటించింది.

జాబాలియాలోకి చొచ్చుకుపోతున్న బలగాలు

గాజాలోని అతిపెద్ద పట్టణ ప్రాంత శరణార్థ శిబిరమైన జాబాలియాలోకి ఇజ్రాయిల్ బలగాలు చొచ్చుకువెళుతున్నాయి. వరుసగా దాడుల అనంతరం అక్కడి ప్రజలను ఖాళీ చేయాల్సిందిగా ఆర్మీ ఆదేశాలు జారీ చేసింది. ఖాన్ యూనిస్ నగరం నుండి కూడా వెళ్లిపోవాల్సిందిగా ప్రజలను ఆదేశించింది. వైమానిక, భూతల దాడులు రెండూ కొనసాగుతున్నాయని ప్రజలు తెలిపారు. డజన్ల సంఖ్యలో మరణాలు సంభవించాయి. ఇదిలావుండగా లెబనాన్ దక్షిణ ప్రాంతంలో జరిగిన దాడిలో 10మంది అగ్నిమాపక సిబ్బంది మరణించారని లెబనాన్ ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఇంకా పలువురు శిథిలాల కింద చిక్కుకుపోయారని పేర్కొన్నారు. బారాచిట్ పట్టణంలోని మున్సిపాలిటీ భవనంలో సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్న అగ్నిమాపక సిబ్బందిపై దాడి జరగడంతో వారు చనిపోయారని తెలిపారు.

పశ్చిమాసియాలో దౌత్య వైఫల్యం సిగ్గుచేటు ! : పోప్ ఫ్రాన్సిస్ వ్యాఖ్యలు

పశ్చిమాసియాలో యుద్ధాన్ని, ఘర్షణలను పరిష్కరించడంలో ప్రపంచ దేశాలు విఫలమవడం సిగ్గుచేటైన వ్యవహారమని పోప్ ఫ్రాన్సిస్ సోమవారం విమర్శించారు. గాజాలో ఇజ్రాయిల్ దాడులకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఏడాది క్రితం, విద్వేషాగ్ని రగిలింది. సిగ్గుపడే రీతిలో అంతర్జాతీయ సమాజం వైఫల్యం కారణంగా అది హింసను చిమ్ముతోంది. ఈ విషాదానికి స్వస్తి పలకడంలో ప్రపంచ అగ్ర దేశాలు విఫలమయ్యాయి." అని ఆయన కేథలిక్కులకు రాసిన బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

శాంతి గురించి బైడెన్, కమలా హారిస్ సన్నాయి నొక్కులు

దాడులతో ఏడాదిగా రగులుతున్న పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణ తక్షణావసరమనిఅమెరికా అధ్యక్షుడు జో బైడెన్, అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ సన్నాయి నొక్కులు నొక్కారు. శాశ్వత శాంతి స్థాపనకు దౌత్య పరిష్కారమొక్కటే ఏకైక మార్గమన్నారు. ఏడాది పొడవునా సాగిన ఈ దాడుల్లో అనేకమంది సామాన్యులు ఇబ్బందులు పడ్డారని బైడెన్ ఒక ప్రకటనలో మొసలి కన్నీరు కార్చారు. మరో వైపు హమాస్, హిజ్బుల్లా, ఇరాన్‌లకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ భద్రతకు అమెరికా పూర్తిగా కట్టుబడి వుందని ప్రకటించారు. అక్టోబరు 7న పాలస్తీనియన్లకు చీకటి రోజుగా అభివర్ణించారు. గాజాలో కాల్పుల విరమణ సాధించే వరకు తాము విరమించబోమని చెప్పారు.

ఇజ్రాయిల్ మూల్యం చెల్లించకతప్పదు : టర్కీ

గత ఏడాది కాలంగా సాగించిన నరమేధానికి ఇజ్రాయిల్ మూల్యం చెల్లించకతప్పదని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ హెచ్చరించారు. ఈరోజు కాకపోతే రేపైనా తాను చేసిన దారుణాలకు, అక్రమాలకు తగిన మూల్యాన్ని చెల్లిస్తుందని అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేశాం యూఎస్ శ్వేతసౌధం బయట నిప్పంటించుకున్న ఓ జర్నలిస్ట్

తొలుత ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చినవారు కూడా, ప్రస్తుతం పశ్చాత్తాపపడుతున్నారు. ఒక జర్నలిస్టు.. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న నిరసనల్లో పాల్గొన్నాడు. గాజాలో కాల్పుల విరమణకు డిమాండ్ చేస్తూ వాషింగ్టన్ నుంచి లాస్ ఏంజెల్స్ వరకు సాగిన నిరసన మార్చ్‌లో వేలాది మందితో కలిసి నడిచాడు. ఆ సమయంలో సదరు జర్నలిస్టు తనకు తాను నిప్పంటించుకున్నాడు.

శ్వేత సౌధం బయట నిప్పంటించుకున్న తర్వాత ఆయన మాట్లాడుతూ.. " నేను జర్నలిస్టును. మేము నిర్లక్ష్యంగా వ్యవహరించాం. మేము తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేశాం" అని ఆవేదనతో చెప్పారు. నిరసనల్లో పాల్గొన్న వ్యక్తులు, స్థానికులు, పోలీసులు సదరు వ్యక్తికి అంటుకున్న మంటలను ఆర్పి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

మీకోసం

పచ్చి బఠానీలను ఉడికించేటప్పుడు చిటికెడు పంచదార కలిపితే రంగు మారకుండా ఉంటాయి.

జీవన సౌరభం

చేయగలిగే శక్తి ఉన్నవాడి కంటే చేయాలనే కోరిక, సంకల్పం ఉన్నవాడు ఎక్కువ ఫలితం సాధిస్తాడు.

మందు మొక్కలం

మందు మొక్కలం
మేము మందు మొక్కలం
రోగాలను నయం చేసే
బంధుమొక్కలం!
ప్రతి ఇంటి పెరటిలో ఉండేటి
పెరటి మొక్కలం!

వేప మొక్కను నేను వేప మొక్కను
నోటి పుల్లగా వాడే నాటి మొక్కను
ఒంటి సబ్బులో వాడేటి చేదు మొక్కను!

ఉసిరి మొక్కను నేను ఉసిరి మొక్కను
పుల్లపుల్లగుండేటి ఉసిరి మొక్కను
విటమిన్ సి అందించే ఉసిరి మొక్కను!

తులసి మొక్కను నేను తులసి మొక్కను
పెరటిలోన ఉండేటి పూజ మొక్కను
రోగనిరోధకతను పెంచేటి మంచి మొక్కను!

బొప్పి మొక్కను నేను బొప్పి మొక్కను
విటమిన్ ఏ కలిగి ఉంటే గొప్ప మొక్కను
ప్లేట్లెట్స్‌ను పెంచేటి బొప్పాయి మొక్కను!

కరివేపను నేను కరివేపను
ప్రతి కూరలో వేసేటి కరివేపను
జీర్ణక్రియకు తోడ్పడే కరివేపాకును!

చాలా మొక్కలం
మేము చాలా మొక్కలం
మంచి మంచి ఔషధాలు నిండిన గనులం!

- ఏడుకొండలు కళ్లేపల్లి,
మచిలీపట్నం, 9490832338.

లెక్క తేల్చండి



పిల్లలూ, ఇక్కడున్న బొమ్మలను అంకెలుగా గణించి లెక్కచేశాం. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

09 : ಣಅಜ

నేను గీసిన బొమ్మ



ఎం.రితేష్,
4వ తరగతి,
సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూలు,
జంగారెడ్డి గూడెం మండలం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

'అతుల్' అనుకున్నది సాధించాడు..

'కల అంటే నిద్రలో వచ్చేది కాదు.. మిమ్మల్ని నిద్రపోనీకుండా చేసేది' అన్న కలామ్ సూక్తిని అక్షరాల ఒంటబట్టించుకున్నాడు ఉత్తరప్రదేశ్ ముజఫర్‌నగర్‌కి చెందిన అతుల్. ఐఐటి ధనాబాద్‌లో ఇంజినీర్ చదవాలన్నది అతని కోరిక. అయితే ఆర్థిక ఇబ్బందులతో డబ్బులు సమకూరేసరికి జరిగిన జాప్యం వల్ల క్షణాల వ్యవధిలో ఆ కల చెదిరిపోయింది. ఫీజు గడువు ముగిసి, సీటు కోల్పోయాడు. అయితే ఈ కుర్రాడు తన కల ఎలాగైనా సాధించాలన్న పట్టుదల కలవాడు. అందుకే ఏడుస్తూ కూర్చోలేదు. మూడు నెలల పాటు పోరాటం చేశాడు. సుప్రీం వరకు వెళ్లాడు. న్యాయం జరిగేవరకు కంటి మీద కునుకులేకుండా గడిపాడు. ఖర్చుల కోసం డబ్బులు ఆదా చేసేందుకు ఒక్కపూట తిన్నాడు. ఎట్టకేలకు అతడి కోరిక నెరవేరింది. కాలేజీలో సీటు సాధించాడు. అతడి పోరాట స్ఫూర్తికి, చదువుకోవాలనుకున్న తపనకి న్యాయం ముగ్ధురాలైంది. పేదింటి కుర్రాడు సాధించిన అపూర్వ విజయమిది.

అతుల్ తండ్రి రాజేంద్ర కుమార్ మీరట్ ఫ్యాక్టరీలో రోజుకు రూ.450 వేతనానికి పని చేస్తాడు. 6గురు ఉన్న ఆ కుటుంబంలో అతని సంపాదన తినడానికే సరిపోదు. అయినా బిడ్డలను చదివించడంలో రాజేంద్ర ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. తన నలుగురు బిడ్డలని ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. అతుల్ అందరిలో చిన్నవాడు.

ఐఐటి నా కల..

తిన్నా తినకపోయినా పిల్లలను చదివించాలన్న తండ్రి లక్ష్యాన్ని పిల్లలందరూ ఒంటబట్టించుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎంతలా వేధించినా చదువొక్కటే తమ బతుకులు బాగుచేస్తుందని బలంగా నమ్మారు. ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తిని పొందే ఆ కుటుంబంలో అతుల్‌కి తన అన్నయ్యలే ప్రేరణ. 'ఐఐటి ఖరగపూర్, ఎన్ఐటి హమీర్‌పూర్‌లో ఇద్దరు అన్నయ్యలు చదువుతున్నారు. మూడో అన్నయ్య ఖటౌలిలోని శ్రీకుంద్ జైన్ డిగ్రీ కాలేజీలో బిఎ హిందీ ఆనర్స్ చేస్తున్నాడు. అన్నయ్యల స్ఫూర్తితో 9వ తరగతి నుండే ఇంజినీర్ కావాలని కల ఉండేది' అంటున్న అతుల్ పాఠశాల విద్య పూర్తిచేసి, జెఇఇలో మంచి ర్యాంకు సాధించాడు.

అప్పు తెచ్చేసరికి ఆలస్యమైంది...

ధనాబాద్ ఐఐటిలో ఇంజినీర్ సీటు ప్రవేశ ఫీజు రూ.17,500. ఈ మొత్తం కూడా భరించే శక్తి లేని కుటుంబం వాళ్లది. 'నాన్న దగ్గర ఉన్న రూ.3,500లకు తోడు అప్పుల కోసం ఎంతో ప్రయత్నించాం. బంధువులు, ఇరుగుపొరుగు సాయం కోరాం. ఎట్టకేలకు డబ్బు సమకూరింది. అయితే ఆఖరు గడువు తేదీ ముగియడంతో కొన్ని సెకన్ల ముందే ఫీజు చెల్లించే పోర్టల్ ఆగిపోయింది' అని అతుల్ ఆ రోజుని గుర్తు చేసుకున్నాడు.



ఫీజు సొమ్ము చాలా తక్కువే. అయినా అతుల్ లాంటి కుటుంబాలు వాటిని భరించడం ఎంతో కష్టం. ఇలాంటి కుటుంబాలు మన చుట్టూ ఎన్నో ఉంటాయి. పిల్లల చదువుల కోసం ఆరాట పడే తల్లిదండ్రులూ మనముందు ఎందరో ఉన్నారు. సకాలంలో డబ్బులు సర్దుబాటు కాక, ఆర్థిక ఇబ్బందుల వల్ల అర్ధంతరంగా చదువులు ఆపేసిన పిల్లలు కూడా బోలెడుమంది. అయితే అతుల్ అందరిలా అలా ఉండిపోవాలనుకోలేదు. తన కల కోసం ఎంతదూరమైనా వెళ్లాలనుకున్నాడు.

సోషల్ మీడియా సాయంతో సుప్రీం తలుపు తట్టాడు..

సోషల్ మీడియా వేదిక ద్వారా అతుల్ తన కల సాకారం చేసుకున్నాడు. సీటు పోయిందన్న షాక్ మా కుటుంబాన్ని ఎంతో బాధించింది. అప్పుడే సోషల్ మీడియాలో ఓ వీడియో చూశాను. ఫీజు చెల్లించలేక సీటు కోల్పోయిన విద్యార్థుల కోసం డిజైన్ చేసిన ఆ వీడియో నాలో ధైర్యాన్ని నింపింది. అన్నయ్యలు, కోచింగ్ మాస్టర్ సాయంతో ధనాబాద్ వెళ్లాను. వాళ్లు జార్ఖండ్ లీగల్ సర్వీస్ అథారిటీని సంప్రదించమన్నారు. ఆ తరువాత మద్రాస్ హైకోర్టు, చివరికి సుప్రీం కోర్టు.. ఇలా నేను, నాన్న చెప్పినచోటికల్లా తిరిగాం.

ఒక్క భోజనం ఇద్దరం తినేవాళ్లం..

కోర్టుల చుట్టూ తిరగడానికి, ప్రయాణాలకి మా దగ్గర డబ్బు లేదు. అందుకే డబ్బు ఆదా చేసేందుకు నాన్న, నేను ఒక్క భోజనాన్నే తినేవాళ్లం. రైల్వే స్టేషన్లలో పడుకునేవాళ్లం' అని అతుల్ చెబుతున్నప్పుడు అతని తల్లి ఇంటి దగ్గర పరిస్థితిని ఇలా చెప్పారు. 'కోర్టుల చుట్టూ తిరిగినన్నాళ్లు, మా ఇంట్లో నవ్వులు లేవు. టైంకి వండుకుని తిన్న రోజులు కూడా లేవు. చాలా దిగాలుపడిపోయాం. బిడ్డ భవిష్యత్తు ఏమౌతుందో అని భయం వేసింది' అని ఆ కష్టకాలాన్ని గుర్తుచేసుకుంది.

ప్రిన్స్ జాబీర్ కథ, నాకు హెల్ప్ అయ్యింది

తన ప్రయాణానికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తుల గురించి అతుల్ ఇలా చెబుతున్నాడు. 'ఇంటర్‌నెట్‌లో ఈ విషయమై సెర్చ్ చేస్తున్నప్పుడు ప్రిన్స్ జాబీర్ కేసు కనపడింది. 2021లో సాంకేతిక కారణాల వల్ల ఫీజు చెల్లించలేక సీటు కోల్పోయిన అతడు సుప్రీంని ఆశ్రయించి విజయం సాధించాడు. అప్పటి విచారణ బృందంలో ప్రస్తుత సుప్రీం చీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఉన్నారు. ఇప్పుడు నా కేసు విచారణలో ఇది బాగా కలిసివచ్చిన అంశం' అని చుట్టూ ఎన్ని ప్రతికూలతలు ఉన్నా సానుకూలంగా ఆలోచించిన అతుల్ ఎంతోమందికి గొప్ప రోల్ మోడల్‌లా కనిపిస్తున్నాడు కదూ.

తీర్పులో ఏం చెప్పారంటే..

2024 సెప్టెంబరు 30న అతుల్ కేసు విచారణలో తుది తీర్పు వెలువడింది. ఆర్టికల్ 142 ప్రకారం ఈ తీర్పు ఇచ్చారు. తక్షణం అతుల్‌కి అడ్మిషన్ ఇవ్వమని కోర్టు కాలేజీని ఆదేశించింది. అంతేకాదు అతను కోరుకున్న ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బిటెక్ ప్రోగ్రామ్‌లోనే సీటు కేటాయించమని సూచించింది. అయితే ఇప్పటికే కౌన్సిలింగ్ సెషన్లు ముగిశాయని కోర్టుకు అతుల్ న్యాయవాదులు వెల్లడించారు. దీంతో 'ఏ కారణం చేతనైనా అతుల్‌కి సీటు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేయొద్ద'ని జస్టిస్ మరోసారి నొక్కివక్కాణించారు. ఈ విజయంతో ఇప్పుడు అతుల్ వార్తల్లో వ్యక్తి అయ్యాడు. అతని ఇల్లంతా స్వీట్లతో నిండిపోయింది. రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు అతుల్ చదువుకు అయ్యే ఖర్చు భరిస్తామని ముందుకు వచ్చారు. గడిచిపోయిన మూడు నెలల సిలబస్‌ని ఎలాగైనా పూర్తిచేయాలన్న దృఢసంకల్పంతో అతుల్ ధనాబాద్ బయల్దేరాడు. ఒక సాధారణ పేదింటి కుర్రాడు సాధించిన గొప్ప విజయమిది. ప్రిన్స్, అతుల్ ఎంతోమంది యువతకి ఆదర్శం.

సూర్య 44వ సినిమా షూటింగ్ పూర్తి

తమిళ హీరో సూర్య తన 44వ సినిమా షూటింగ్‌ను పూర్తిచేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ సోషల్‌మీడియాలో పోస్ట్‌పెట్టారు. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఈ సినిమా షూటింగ్ జూన్‌లో మొదలైంది. తాజాగా దీని చిత్రీకరణ పూర్తయినట్లుగా సూర్య ప్రకటించారు. టీమ్‌తో కలిసి దిగిన ఫొటోలను పంచుకున్నారు. 'ఎన్నో లొకేషన్లలో దీని షూటింగ్‌చేశాం. చిత్రీకరణంతా చాలా ఆనందంగా జరిగింది. ఈ సినిమా కోసం ఎంతోమంది టాలెంటెడ్ వ్యక్తులు పనిచేశారు. కార్తీక్ సుబ్బరాజు నాకు సోదరుడితో సమానం. అతడి దర్శకత్వంలో పనిచేసినందుకు సంతోషంగా ఉంది.జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకాలను ఈ టీమ్ నాకు అందించింది' అంటూ చిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. సినిమాపై మీకున్న అంకితభావం, నిబద్ధత వల్లే షూటింగ్ ఇంత త్వరగా పూర్తిచేయగలిగాం' అంటూ సూర్యకు కార్తీక్ సుబ్బరాజు సమాధానం ఇచ్చారు. ఎప్పుడు విడుదల చేస్తామనేది త్వరలోనే వెల్లడిస్తామని వారు ప్రకటించారు. ప్రేమ, యుద్ధం నేపథ్యంలో రానున్న ఈ సినిమాలో సూర్య సరసన పూజాహెగ్డే నటించారు. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమాలో జోజు జార్జ్, జయరామ్ తదితరులు నటించారు. వచ్చే సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేసేందుకు దర్శక, నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. సూర్య నటించిన 'కంగువా' సినిమా త్వరలోనే విడుదల కానుంది. దర్శకుడు శివ తెరకెక్కించిన ఈ సినిమాలో దిశాపటానీ హీరోయిన్. కంగ అనే ఓ పరాక్రముడి కథతో రూపొందుతున్న ఈ సినిమాలో సూర్య ఆరు విభిన్న లుక్స్‌లో కనిపిస్తారని సమాచారం.

10 నుంచి ఓటీటీలో 'గొర్రె పురాణం'

సుహాస్ హీరోగా నటించిన చిత్రం 'గొర్రె పురాణం'. బాబీ దర్శకత్వంలో ప్రవీణ్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 20న విడుదలైంది. ఈనెల 10 నుంచి ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుందని ఆహా ఒక పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమా విడుదలైన మూడువారాలై అయ్యింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ వచ్చినప్పటికీ అనుకున్నంతగా కలెక్షన్లు సాధించలేదు. సుహాస్ కొత్త సినిమా 'జనక అయితే గనక' దసరా సందర్భంగా ఈనెల 12న థియేటర్లలో విడుదల కానుంది.

గాయకుడు అద్నాన్‌సమీకి మాతృవియోగం

గాయకుడు అద్నాన్ సమీ తల్లి బేగమ్‌సమీఖాన్ (77) అనారోగ్యంతో మృతిచెందారు. బాలీవుడ్‌తోపాటు తెలుగులో కూడా అద్నాన్ సమీ సూపర్‌హిట్ పాటలు పాడారు. ఈ క్రమంలో ఆయన భారీగా అభిమానులను సంపాదించుకున్నారు. తనతల్లి ఫొటోను సోషల్ మీడియాలో అద్నాన్ షేర్‌చేశారు. 'నాకెంతో ఇష్టమైన మా అమ్మ బేగంనౌరీన్ సమీఖాన్ మరణవార్తను ప్రకటించటం చాలా బాధగా ఉంది. ఆమె మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నాను. ఈ సమయంలో చెప్పలేనంత దు:ఖంతో మా కుటుంబం మునిగిపోయి ఉంది. ఆమె ప్రతి ఒక్కరికీ ప్రేమ, ఆనందాన్ని పంచింది. ఆమెను కోల్పోయామనే నిజాన్ని నమ్మలేక పోతున్నాం' అని పేర్కొన్నారు.

'సింగం అగైన్' ట్రైలర్ విడుదల



బాలీవుడ్‌కు చెందిన అజయ్‌దేవ్‌గణ్, దీపికపదుకొణె నటించిన చిత్రం 'సింగం అగైన్'. ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్లు విడుదల చేశారు. ఇప్పటికే 'సింగం' ఫ్రాంఛైజీ నుంచి పలు సినిమాలు విడుదలయ్యాయి. యూనివర్స్ సినిమాగా రోహిత్‌శెట్టి ఈ సినిమాను బాలీవుడ్‌కు చెందిన భారీ తారాగణంతో నిర్మించారు. రణ్‌వీర్‌సింగ్, జాకీ ష్రాఫ్, టైగర్ ష్రాఫ్, కరీనా కపూర్ వంటి స్టార్లు ఉన్నారు. 4.58 నిముషాల నిడివితో ఉన్న ట్రైలర్ మెప్పించేలా ఉంది. దీపావళి సందర్భంగా నవంబర్ ఒకటోతేదీన ఈ సినిమా విడుదల కానుంది.

'అభిమాని' గ్లింప్స్ విడుదల

సురేష్ కొండేటి హీరోగా, అక్సాఖాన్ హీరోగా 'అభిమాని' (ది డిజైర్ ఆఫ్ ఏ ఫ్యాన్) సినిమా రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమా నుంచి గ్లింప్స్‌ను దర్శకుడు రాఘవేంద్రరావు ఆవిష్కరించారు. హీరో చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా పోస్టర్‌ను మేకర్లు విడుదల చేశారు. రాంబాబు దోమకొండ దర్శకత్వం వహించారు. ఎస్‌కె రెహ్మాన్, కంద సాంబశివరావు నిర్మాతలు. డ్రమ్స్ రాము మ్యూజికల్ డైరెక్టర్. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ, 'అభిమాని సినిమా గ్లింప్స్ చాలా బాగుంది. టైటిల్ సెలక్షన్‌తోనే సినిమా సగం విజయం సాధించింది. అభిమాని అంటే కేవలం ఫస్ట్ డే ఫస్ట్ షోకి వెళ్లి సినిమా చూసి కాగితాలు ఎగరేయటమే కాదు. తన అభిమాన హీరో చేసే మంచి కార్యక్రమాలు, వారిలో ఉన్న మంచి లక్షణాలు, వారు ఎంత కష్టపడి పైకి వచ్చారో తెలుసుకుని, తాను పాటిస్తూ పదిమందికి చెప్పాలి. అదే ఈ సినిమా ముఖ్య ఉద్దేశ్యం' అని వివరించారు.

జిమ్నాస్టిక్స్‌కు దీప కర్మాకర్ గుడ్‌బై

అగర్తల: భారత మహిళా జిమ్నాస్ట్ దీపా కర్మాకర్(31) సంచలన నిర్ణయం తీసుకుంది. ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు సోమవారం ఎక్స్ పోస్ట్(ట్విటర్)లో వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల్లో మళ్లీ అంతర్జాతీయ వేదికలపై తలపడడం, మార్పులకు తన శరీరం సహరించకపోవడం కారణమని వెల్లడించింది. మ్యాట్‌కు వీడ్కోలు పలుకుతున్నా. నా సుదీర్ఘ ప్రయాణంలో భాగమైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. కొత్త అధ్యాయం మొదలు పెట్టబోతున్నా అని దీప ఓ పోస్ట్ పెట్టింది. భారత్‌లో జిమ్నాస్ట్ అంటే మొదట గుర్తొచ్చే పేరు దీప కర్మాకర్. ఈశాన్య రాష్ట్రం నుంచి వచ్చిన ఆమె ఈ ఆటలో ఎన్నో శిఖరాలు అధిరోహించింది. అంతర్జాతీయ, దేశ స్థాయి పోటీల్లో ఎన్నో మెడల్స్ కొల్లగొట్టింది. రియో ఒలింపిక్స్‌లో తృటిలో పతకం చేజార్చుకున్న దీప 2014లో జరిగిన కామన్‌వెల్త్ గేమ్స్‌తో వెలుగులోకి వచ్చింది. ప్రొడునోవ వాల్ట్‌లో అత్యధిక పాయింట్లు సాధించి కాంస్య పతకం గెలిచింది. దాంతో, ఆమె పేరు ఒక్కసారిగా మారుమోగిపోయింది. ఆ తర్వాత 2016 రియో ఒలింపిక్స్‌లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన నాల్గో స్థానంలో నిలిచి కాంస్య పతకం చేజార్చుకుంది.

కరేబియన్ ప్రిమియర్ లీగ్ విజేత సెయింట్ లూసియా కింగ్స్

కరేబియన్ ప్రిమియర్ లీగ్ సీజన్-10 టైటిల్‌ను సెయింట్ లూసియా కింగ్స్ జట్టు చేజిక్కించుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో సెయింట్ లూసియా జట్టు ఆరు వికెట్ల తేడాతో గయానా అమెజాన్ వారియర్స్‌పై విజయం సాధించింది. తొలుత డిఫెండింగ్ ఛాంపియన్ గయానా నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 138పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని సెయింట్ లూసియా 18.1ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి ఛేదించింది.

చైనా ఓపెన్ విజేత కోకా గాఫ్

- ఫైనల్లో ముఛోవాపై గెలుపు

బీజింగ్: చైనా ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను ప్రపంచ ఆరో ర్యాంకర్, అమెరికా యువ సంచలనం కోకో గాఫ్ చేజిక్కించుకుంది. ఆదివారం బీజింగ్‌లోని డైమండ్ కోర్ట్ వేదికగా జరిగిన ఫైనల్లో గాఫ్ 6-1, 6-3తో కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్)ను వరుస సెట్లలో చిత్తు చేసింది. ఫైనల్‌లో గాఫ్ 6 ఏస్‌లు సంధించగా ముచోవా 2 మాత్రమే కొట్టగలిగింది. ఈ టోర్నీలో నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన గాఫ్.. గత మ్యాచ్‌లకు భిన్నంగా ఆరంభం నుంచే దూకుడుగా ఆడుతూ వరుస సెట్లలో గెలిచి ట్రోఫీని దక్కించుకుంది. తద్వారా 2013 (సెరెనా విలియమ్స్) తర్వాత చైనా ఓపెన్ గెలిచిన రెండో అమెరికన్‌గా రికార్డులకెక్కింది. ఈ ఏడాది ఆమెకు ఇది రెండో డబ్ల్యూటిఎ 1000 టైటిల్ కాగా.. ఓవరాల్‌గా 8వ టైటిల్. ఈ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో స్పెయిన్ యువ సంచలనం కార్లొస్ అల్కారజ్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే.

రాజమండ్రిలో అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీలు

- క్రీడలకు ప్రోత్సాహం : మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి -రాజానగరం

జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం దివాన్ చెరువు శ్రీప్రకాష్ విద్యానికేతన్ ప్రాంగణంలో 68వ రాష్ట్ర అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ ఛాంపియన్ షిప్-2024 పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని, మన క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు సహకరిస్తుందని తెలిపారు. త్వరలోనే బాల్ బ్యాడ్మింటన్, ఇతరత్రా క్రీడలను రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తామన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజనగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ యాజమాని విజయ ప్రకాష్, అధికారులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

షఫీక్, మసూద్ సెంచరీలు

- పాకిస్తాన్ 328/4
- ఇంగ్లండ్‌తో తొలిటెస్ట్

ముల్తాన్: ఇంగ్లండ్‌తో ప్రారంభమైన తొలిటెస్ట్‌లో పాకిస్తాన్ ఓపెనర్ అబ్దుల్లా షఫీక్, కెప్టెన్ షాన్ మసూద్ సెంచరీలతో కదం తొక్కారు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి పాకిస్తాన్ జట్టు 4వికెట్ల నష్టానికి 328పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్‌కు ఓపెనర్ ఆయుబ్(4) నిరాశపరిచినా.. షఫీక్, మసూద్ కలిసి సెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరూ 2వ వికెట్‌కు 253పరుగులు జతచేశారు. కెప్టెన్ షాన్ మసూద్(151), షఫీక్(102) సెంచరీలు కొట్టారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో 1,524 రోజుల తర్వాత ఇదే అతడికి తొలి శతకం. డబుల్ సెంచరీ దిశగా దూసుకెళ్తున్న సమయంలో జాక్ లీచ్ అతడిని రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. తొలిరోజు ఆట ముగిసే సమయానికి మాజీ కెప్టెన్ బాబర్ ఆజాం(11), సాద్ షకీల్(12) క్రీజ్‌లో ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లు అట్కిన్సన్‌కు రెండు, వోక్స్, లీచ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68